మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 28-9-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 90 Issue: 90

Published From Jagitial
www.evarthalu.com


శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం – వర్ష ఋతువు, భాద్రపద మాసం – కృష్ణపక్షం, సూర్యోదయం – ఉ. 6:07, సూర్యాస్తమయం – సా. 6:15, తిథిజి, అష్టమి తె. 3:07ం వరకు, తరువాత నవమి , సంస్కృత వారం, భాను వాసరః, నక్షత్రం, రోహిణి ఉ. 8:40 వరకు, తరువాత మృగశిర, యోగం, వజ్ర ఉ. 7:31 వరకు, కరణం, భాలవ సా. 4:05 వరకు, కౌలవ తె. 3:07ం వరకు, వర్జ్యం మ. 2:01 నుండి మ. 3:32 వరకు, దుర్ముహూర్తం, సా. 4:38 నుండి సా. 5:27 వరకు, రాహుకాలం, సా. 4:44 నుండి సా. 6:15 వరకు, యమగండం, మ. 12:11 నుండి మ. 1:42 వరకు, గుళికాకాలం, మ. 3:13 నుండి సా. 4:44 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:31 నుండి తె. 5:19 వరకు, అమృత ఘడియలు, తె. 5:40 నుండి ఉ. 7:10 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:47 నుండి మ. 12:35 వరకు, గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# మూసీ మహోగ్రరూపం

## జంట జలాశయాలకు భారీ వరద

**ఎంజీబీఎస్‌ను ముంచెత్తిన నీళ్లు.. వందేళ్లలో తొలిసారి భారీ ఉధృతి**

అలా ఓ చిన్న పాయలా.. కనిపించీ కనిపించకుండా.. ఇక కనుమరుగైపోతోంది అన్నట్లుగా ఉండే మూసీ నది.. ఒక్కసారిగా మహోగ్రరూపాన్ని ఆవహించుకుంది... తక్కువ అంచనా వేస్తే తడాఖా చూపిస్తా అన్నట్లు తన ప్రకోపాన్ని ప్రదర్శించింది. దెబ్బకు రాష్ట్ర ప్రధాన బస్టాండ్ ఎంజీబీఎస్ కూడా నీళ్లతో నిండిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా వరద నీరు బస్ స్టేషన్లోకి చొచ్చుకురావడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. బస్ స్టేషన్‌లోని ప్రయాణికులను ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది రోప్ సహాయంతో బయటకు తరలించారు. అనంతరం బస్టాండ్‌ను మూసివేశారు.



నేటి బతుకమ్మ: వెన్నముద్దల బతుకమ్మ

నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు.



నేటి అవతారం మహా చండీ దేవి

శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం, విజయవాడ

# 40 మందిని తొక్కి చంపేశారు!

## టీవీకే అధినేత విజయ్ ర్యాలీలో మహా విషాదం




టీవీకే అధినేత విజయ్ ర్యాలీలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 40 మంది మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కరూర్ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో పలువురు చిన్నారులు ఉన్నట్టు స్థానిక ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అనుకున్న సమయానికి ఆరు గంటలు ఆలస్యంగా వేదిక వద్దకు విజయ్ చేరుకోవడంతో ఆయనను చూసేందుకు ఒక్కసారిగా అభిమానులు ఎగబడ్డారు. దీంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది.

కరూర్: రాత్రి 7:45 గంటలకు ఈ తొక్కిసలాట చోటుచేసుకుంది. ర్యాలీలో 30,000 మందికి పైగా జనం పాల్గొన్నట్టు చెబుతున్నారు. విజయ్‌ను చూసేందుకు ఒక భవంతి పిట్టగోడపై పలువురు చేరడంతో పిట్టగోడ కుప్పకూలిందని, దీంతో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది. దీంతో కొంత గందరగోళం, తొక్కిసలాట జరిగిందని తెలుస్తోంది. దీంతో విజయ్ తన ప్రసంగాన్ని మధ్యలోనే నిలిపివేశారు. వేదిక పైనుంచి పోలీస్ ప్లీజ్ హెల్ప్ అంటూ విజ్ఞప్తి చేశారు. విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘటనపై ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ తరువాయి 2 వ పేజీలో...



# హైదరాబాద్‌ను ముంచిండు

**1.5 లక్షల కోట్లు దోచుకోడానికి రేవంత్ ప్లాన్**

**వరదలతో హైదరాబాదీలను ముంచిండు: కేటీఆర్**

రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ.1,50,000 కోట్లను దోచుకోవడానికి హైదరాబాద్ ప్రజలను వరదలో రేవంత్ రెడ్డి ముంచిండని సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌ల కేటీఆర్ సమక్షంలో కొడంగల్ నియోజక వర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): కేటీఆర్ మాట్లాడుతూ.. కొడంగల్ ప్రజల జోష్ చూస్తుంటే రేవంత్ రెడ్డి కొడంగల్‌లో పోటీ చేసేలా కనిపించడం లేదని, పక్కా పారిపోతాడని అన్నారు. రేవంత్ రెడ్డి మీద కొడంగల్ ప్రజలకు కోపముందని, ఆయన్ని ఎలాగైనా ఓడించాలని -2 వ పేజీలో...

# జీవో ఆగే.. స్థానికమూ ఆగే..!

**బీసీ రిజర్వేషన్ల జీవోకు హైకోర్టు బ్రేక్**

**స్థానిక ఎన్నికలు కూడా వేయాలని సూచన**

**బిల్లు పెండింగ్‌లో ఉండగా జీవో ఎలా?**

**రిజర్వేషన్లు 50 శాతం మించొద్దని తెలీదా?**

**ఏజీకి హైకోర్టు ధర్మాసనం సూటి ప్రశ్నలు**

**తదుపరి విచారణ అక్టోబర్ 8కి వాయిదా**




హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో విషయంలో సర్కారుకు షాక్ తగిలింది. గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా జీవో ఇవ్వడం సరికాదని న్యాయస్థానం అభిప్రాయపడింది. రిజర్వేషన్ల అంశంలో చట్టప్రకారమే ముందుకెళ్లాలని వ్యాఖ్యానించింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవోను కొట్టివేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్‌కు చెందిన బుట్టెంగారి మాధవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభినందన్ కుమార్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 42 శాతానికి పెంచారని, దీంతో మొత్తం రిజర్వేషన్ల పరిమితి తరువాయి 2 వ పేజీలో...

## బంగారం–వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.11,548 |
| వెండి (గ్రాము): | రూ.159 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,490 |

## విశ్వవాణి




దెబ్బతిన్న వెన్నుపూసను మళ్లీ పునర్నిర్మించే 'పాలీలమినిన్' ఔషధాన్ని బ్రెజిల్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ ఔషధాన్ని అభివృద్ధి చేసేందుకు శాస్త్రవేత్తలకు ఏకంగా 25 ఏళ్లు పట్టింది.

# పాలల్లో 'పింక్' పడింది!

**మదర్ డెయిరీ ఎన్నికల్లో కారు జోరు.. అధికార కాంగ్రెస్‌కు ఘోర పరాభవం**

**రెండు స్థానాల్లో బీఆర్ఎస్, ఒక చోట కాంగ్రెస్ గెలుపు**




హయత్ నగర్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): మదర్ డెయిరీ డైరెక్టర్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హయత్ నగర్‌లో మూడు డైరెక్టర్ల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాలను బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, సుదగాని భాస్కర్ గౌడ్ విజయం సాధించగా, కర్నాటి జయశ్రీ మరో స్థానంలో గెలుపొందారు. రెండు జనరల్, ఒక తరువాయి 2 వ పేజీలో...

# సిరిసిల్ల కలెక్టర్ ట్రాన్స్‌ఫర్



సందీప్ కుమార్ ఝాపై బదిలీ వేటు

2లో

- హైదరాబాద్ సీపీగా సజ్జనార్ నియామకం
- హోంశాఖ ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్
- ఇంటెలిజెన్స్ బాధ్యతలు విజయ్‌కుమార్‌కు
- టీజీఎస్ ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి అపాయింట్
- రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీ
- సిరిసిల్లలో కొంతమంది ప్రజల సంబురాలు



ఐటీడీఏ భద్రాచలం పరిధిలో ట్రైబల్ మ్యూజియాన్ని అద్భుతంగా తీర్చిదిద్ది పర్యాటకులను విశేషంగా ఆకర్షించినందుకు, 2025 సంవత్సరానికి టూరిజం ఎక్సలెన్స్ అవార్డును సీఎం రేవంత్ చేతుల అందుకుంటున్న ప్రాజెక్ట్ అధికారి, ఐఏఎస్ రాహుల్

# హైదరాబాద్ సురక్షితం

**ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ.. ప్రపంచ నగరాలతో భాగ్యనగరం పోటీ**

**నూతన టూరిజం పాలసీ తీసుకొచ్చాం.. టూరిజం డే కాంక్లేవ్‌లో సీఎం రేవంత్**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): తెలంగాణలో నూతన టూరిజం పాలసీ తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన వరల్డ్ టూరిజం డే మొదటి కాంక్లేవ్‌లో సీఎం పాల్గొని ప్రసంగించారు. "గోల్కొండ, రామోజీ ఫిల్మ్‌సిటీ వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. ఎకో, మెడికల్, హెల్త్ టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించాం. హైదరాబాద్ ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ.. హైదరాబాద్‌లో ప్రపంచ సుందరీమణుల తరువాయి 2 వ పేజీలో...

# పార్టీ మారారా? లేదా?

**ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ప్రశ్నల వర్షం**

**సోమవారం నుంచి విచారణలు**

**షెడ్యూల్ విడుదల చేసిన స్పీకర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఎమ్మెల్యేల అనర్హతా పిటిషన్ల విచారణ షెడ్యూల్‌ను శనివారం ఖరారు చేశారు. సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 11 గంటలకు మొదలయ్యే విచారణలు అక్టోబర్ 1 వరకు -2 వ పేజీలో...

## రాశి ఫలాలు
28.9.2025

మేషం: అనుకున్న వ్యవహారాలు ముందుకు సాగుతాయి. ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. కొన్ని విషయాలలో బంధువులు, మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆర్థిక సమస్యలు సతమతం చేస్తాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

వృషభం: సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు విస్తృతమవుతాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు ఆహ్వానాలు అందుతాయి. సోదరుల నుంచి ధన సహాయం అందుతుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి.

మిధునం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. విద్యార్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. వాహనయోగం ఉన్నది. పనులలో అవాంతరాలు అధిగమిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి.

కర్కాటకం: ముఖ్యమైన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది.

సింహం: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఇంటాబయటా సమస్యలు బాధిస్తాయి. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగాలు అంతంతమాత్రంగా ఉంటాయి.

కన్య: చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. బంధువులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కుటుంబ సభ్యులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఉద్యోగాలలో బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తారు.

తుల: చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. నిరుద్యోగులు కష్టపడ్డా ఫలితం ఉండదు. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక చికాకులు కలుగుతాయి. ముఖ్య వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో నూతన సమస్యలు ఎదురవుతాయి.

వృశ్చికం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక వ్యవహారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. కొనుగోలు ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా పని చేసి అధికారుల అనుగ్రహం పొందుతారు.

ధనస్సు: కీలక వ్యవహారాలు మందగిస్తాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. సోదరులతో అకారణ కలహ సూచనలు ఉన్నవి. నూతన రుణ యత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

మకరం: అనుకున్న పనులు అనుకున్న రీతిలో సాగుతాయి. మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి చేసే ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ప్రభుత్వ అధికారులతో చర్చలు సఫలమవుతాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక మార్పులు కలుగుతాయి.

కుంభం: నిరుద్యోగులకు నూతన ఉద్యోగాలు దక్కుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. సంతానం విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలిస్తాయి.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. నూతన రుణయత్నాలు సాగిస్తారు. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు చోటుచేసుకుంటాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది.

# మూసీ మహోగ్రరూపం

## జంట జలాశయాలకు భారీ వరద.. ఎంజీబీఎస్‌ను ముంచెత్తిన నీళ్లు.. వందేళ్లలో తొలిసారి భారీ ఉద్ధృతి

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్) ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులెవరూ ఎంజీబీఎస్‌కు రావొద్దని అధికారులు సూచించారు. మూసీ, ఈసా నదుల ఉద్ధృతితో ఒక్క రోజులోనే రికార్డు స్థాయిలో హైదరాబాద్ జంట జలాశయాలకు భారీ స్థాయిలో వరద పోటెత్తింది. ఇక్కడి నుంచి నీటి విడుదలతో మూసీ పరివాహక బస్తీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చాదర్‌ఘాట్, ముసారాంబాగ్ బ్రిడ్జి పైనుంచి ప్రవాహం కొనసాగడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. గండిపేట జలాశయానికి ఒక్కరోజులోనే రికార్డుస్థాయిలోనే వరద ప్రవాహం పోటెత్తింది. జంట జలాశయాలు మొదలు గౌరెల్లి వరకు ఉద్ధృతంగా ప్రవాహిస్తూ భయానక స్థితిలో దర్శనమిచ్చింది. బాపూఘాట్ నుంచి జియాగూడ, మూసారాంబాగ్ వరకు మూసీ ప్రభావం తీవ్రంగా కనిపించింది. వికారాబాద్, తాండూరు, రంగారెడ్డి జిల్లా శివార్లలో కురిసిన కుండపోత వానలకు మూసీ, ఈసా నదులు ఉగ్రరూపం దాల్చాయి. హైదరాబాద్ జంట జలాశయాలకు ప్రవాహం పోటెత్తడంతో అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో మంచిరేవుల-నార్సింగి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై నుంచి నీరు ప్రవహించింది. దీంతో ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు



చేరింది. హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, పోలీసు విభాగాలు సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను చేపట్టాయి. నాగోలు వంతెన వద్ద మూసీ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కర్నూలు మార్గంలో వచ్చే బస్సులను ఆరాంఘర్ వద్ద, విజయవాడ మార్గంలో వచ్చే బస్సులను ఎల్‌బి నగర్ వద్ద, కరీంనగర్ మార్గంలో వచ్చే బస్సులను జెబిఎస్ వద్ద, సంగారెడ్డి మార్గంలో వచ్చే బస్సులను పటాన్‌చెరు వద్ద నిలిపివేశారు. మరోవైపు, రాష్ట్రం మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 40 కిలో మీటర్ల కంటే తక్కువ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఆయా జిల్లాలకు అధికారులు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. జనగామ, కామారెడ్డి, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, ఆదిలాబాద్, హనుమకొండ, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేశారు.

### మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్

మూసీ పరివాహక ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేసిన రెవెన్యూ, జిహెచ్ఎంసి, పోలీసు శాఖలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా చాదర్‌ఘాట్, శంకర్ నగర్, గోల్నాక డివిజన్ పరిధిలోని కృష్ణా నగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రదేశాలకు తరలించారు. పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాళ్లను పునరావాస కేంద్రాలుగా మార్చి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు.

### ఎంజీబీఎస్‌లో తగ్గిన వరద

శనివారం సాయంత్రానికి ఎంజీబీఎస్‌లో మూసీ నది వరద ప్రవాహం తగ్గింది. అయినా బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాంల మీదికి బస్సులు, ప్రయాణికులను అనుమతించ లేదు. రాత్రికి తిరిగి వర్షం సూచన నేపథ్యంలో ప్రయాణికులను అనుమతించలేదు. ఆదివారం పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని ఆర్ఎం శ్రీలత తెలిపారు. వరద కారణంగా ఎంజీబీఎస్‌లో పేరుకుపోయిన చెత్త, బురదను జేసీబీల సాయంతో తొలగించారు.

## 40మందిని తొక్కి చంపేశారు!

మొదటి పేజీ తరువాయి

దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కరూర్ జిల్లా కార్యదర్శి వి.సెంథిల్ బాలాజీని ఆదేశించారు. కరూర్ నుంచి వచ్చిన సమాచారం తనను ఎంతో ఆవేదనకు గురి చేసిందని, తొక్కిసలాటలో స్పృహతప్పి ఆసుపత్రిలో చేరిన వారికి తక్షణ వైద్య సాయం అందించాల్సింగా స్థానిక యంత్రాంగాన్ని కోరామని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన తెలిపారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మోదీ ఆదేశించారు. కాగా, టీవీకే ర్యాలీలపై పోలీసులు కఠిన ఆంక్షలు విధిస్తున్నారంటూ టీవీకే పార్టీ ఇటీవల మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేసింది. అన్ని పార్టీలకూ ఈ ఆంక్షలు వర్తిస్తాయా? అని ప్రశ్నించింది. ఈ సందర్భంగా ఈనెల 13న విజయ్ తిరుచ్చి ర్యాలీలో జనం అదుపుతప్పడాన్ని జస్టిస్ ఎన్.సతీష్ కుమార్ ప్రస్తావిస్తూ.. జరగరానిది ఏదైనా జరిగితే దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అని ప్రశ్నించారు. పార్టీ అధ్యక్షుడు క్రౌడ్స్‌ను విజయ్ కంట్రోల్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ విషాదం జరగడం గమనార్హం.

## హైదరాబాద్ సురక్షితం

మొదటి పేజీ తరువాయి

పోటీలు నిర్వహించి.. ఇది అత్యంత సురక్షితమైన నగరమని నిరూపించాం. హైదరాబాద్‌లో రక్షణ, శాంతిభద్రతల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. శాంతిభద్రతల విషయంలో దేశంలోనే హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచ ప్రఖ్యాత నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. మీకు అండగా ఉండటంతో పాటు, లాభాలను అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుం టుంది" అని సీఎం అన్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపా రు." తెలంగాణ అద్భుతమైన రాష్ట్రం. రెండు జీవనదుల మధ్య ఉన్న దక్కన్ పీఠభూమి. గలగలపారే జీవనదులు, ఎత్తైన కొండలు, ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలతో కూడిన అటవీ ప్రాంతం. పర్యాటకులకు తెలంగాణ పరిసర ప్రాంతాలు స్వర్గసీమ లాంటివి. పర్యాటకు లను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్న రాష్ట్రమిది. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారత రాష్ట్రసమితి టూరిజంపై దృష్టి సారించకుండా, ఈ రాష్ట్ర ఔన్నత్యాన్ని ప్రపంచపటం మీదకు తీసుకెళ్లకుండా, పర్యాటకులను ఆకర్షించకుండా గాలికి వదిలేసింది" అని భట్టి విక్రమార్క విమర్శించారు. ఈ సందర్భంగా 30 సంస్థలు రూ.15వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. టూరిజం కాంక్లేవ్‌లో మెడికల్ టూరిజం, ఫిల్మ్ ఇన్ తెలంగాణ పోర్టల్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాలల్లో 'పింక్' పడింది!

మొదటి పేజీ తరువాయి

మహిళా డైరెక్టర్ స్థానానికి ఎన్నికలు నిర్వహించగా, మొత్తం తొమ్మిది మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు రెండు స్థానాలను గెలుచుకున్నారు. ఈ ఫలితాల నేపథ్యంలో ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య, యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి వ్యవహారశైలిపై కాంగ్రెస్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఓడించేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ వ్యక్తిని మదర్ డెయిరీ ఎన్నికల్లో నిలబెట్టి మద్దతు ఇవ్వడం సరికాదని ఎమ్మెల్యే ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డిపై సామేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జీవో ఆగే.. స్థానికమూ ఆగే..!

మొదటి పేజీ తరువాయి

60 శాతానికి పైగా దాటిందని పిటిషనర్ తెలిపారు. రాజ్యాంగంలో 50 శాతం రిజర్వేషన్లు దాటకూడదనే నిబంధన ఉందని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతమే ఉండాలని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. నూతన జీవో వల్ల రిజర్వేషన్ల పరిమితి 67 శాతానికి చేరిందన్నారు. బీసీ రిజర్వేషన్లు 35 శాతం పెంచుతూ 2018లో జీవో ఇచ్చారని, ఆ జీవోను ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసిందని గుర్తుచేశారు. తమిళనాడులో రిజర్వేషన్లు 69 శాతానికి పెంచారు కదా? అని హైకోర్టు ప్రశ్నించగా.. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టి రిజర్వేషన్ పెంచారని, ప్రస్తుతం అది సుప్రీంకోర్టులో విచారణలో ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని 285ఏ సవరిస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేశారని, అసెంబ్లీ తీర్మానం ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న అంశంపై జీవో ఎలా జారీ చేస్తారని హైకోర్టు.. ఏజీని ప్రశ్నించింది.

## జడ్పీ రిజర్వేషన్లు ఖరారు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): స్థానిక ఎన్నికలకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ జడ్పీల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు శనివారం జీవో జారీ చేసింది. కులగణన డేటా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది.

**ఎస్టీ** – ములుగు, వరంగల్, ఖమ్మం, నల్లగొండ

**ఎస్సీ** – హనుమకొండ, జనగామ, జోగులాంబ గద్వాల, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి

**బీసీ** – సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, సూర్యాపేట, నాగర్ కర్నూల్, మంచిర్యాల, వికారాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి

**జనరల్** – పెద్దపల్లి, జగిత్యాల, నారాయణపేట, కామారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం

### పార్టీ మారారా? లేదా?

కొనసాగుతాయి. పిటిషనర్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, చింత ప్రభాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు. రెస్పాండెంట్లుగా టీ ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), కాలే యదయ్య (చేవెళ్ల), గుడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (జోగులంబ గద్వాల్) ఉన్నారు. స్పీకర్ రెండు వైపులా వాదనలు విని, 10వ షెడ్యూల్ ప్రకారం నిర్ణయం తీసుకుంటారు. ఈ ప్రక్రియ సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా జరుగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు 2024 మార్చి-ఏప్రిల్‌లో కాంగ్రెస్‌లోకి చేరారు. దానం నగేందర్ (ఖైరతాబాద్), బండ్లా కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకటరావు (భద్రాచలం), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ), కాలే యదయ్య (చేవెళ్ల), టి. ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), ఎం. సంజయ్ కుమార్ (జగిత్యాల), గుడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి). ఈ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు కల్వకుంట్ల సంజయ్, చింత ప్రభాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి మొదలైనవారు స్పీకర్ వద్ద అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. జూలై 31, 2025న సుప్రీం కోర్టు సిజెఐ బీఆర్ గవాయ్ బెంచ్ స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

## హైదరాబాద్‌ను ముంచిండు

మొదటి పేజీ తరువాయి

కంకణం కట్టుకొని ఉన్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి సీఎం రేవంత్ రెడ్డి అని.. కానీ కొడంగల్‌కు మాత్రం తిరుపతి రెడ్డి సీఎం అని తీవ్ర విమర్శలు గుప్పించారు. వార్డు మెంబర్, సర్పంచ్, కౌన్సిలర్ కూడా కాని తిరుపతి రెడ్డికి కలెక్టర్లు, ఎస్పీలు వంగి వంగి దండాలు పెడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అధికారంలో వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా ఒక్క మంచి పని కూడా చేయలేదని విమర్శించారు. రూ. 1,50,000 కోట్లతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టును మొదలుపెట్టారని.. కానీ అది దోచుకోవడానికేనని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రూ. 15 వేల కోట్లతో మూసీ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రణాళికలు చేశామని.. దాన్ని ఇప్పుడు రేవంత్ రెడ్డి పది రెట్లకు పెంచారని విమర్శించారు. వందేళ్ల కింద మూసీకి వరదలు వస్తే అప్పటి నిజాం ప్రభువు ఉస్మాన్ సాగర్, నిజాం సాగర్ చెరువులను కట్టారని తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలు రాగానే ఆ రెండు చెరువుల నీళ్లను ఖాళీ చేసి మూసీ వరదలు తట్టుకునేలా సిద్ధం చేయాలని.. అప్పుడు హైదరాబాద్‌కు వరద తగ్గుతుందని దఅన్నారు. కానీ మూసీ ప్రాజెక్టు ఎలాగైనా చేయాలన్న దురుద్దేశంతో ఆ రెండు చెరువులను ఖాళీ చేయకుండా కావాలని ఈరోజు వరద వదిలారని ఆరోపించారు. రూ.1,50, 000 కోట్ల రూపాయలను దోచుకోవడానికి హైదరాబాద్ ప్రజలను వరదలో రేవంత్ రెడ్డి ముంచారని ఆరోపించారు. మూసీ వద్దంటున్నారని రేవంత్ రెడ్డి కోపంతో ఉన్నారని.. పేదవాళ్లను ముంచైనా దాన్ని పూర్తి చేస్తానని చెప్పడానికే కిరాతకంగా వ్యవహరించారని సంచలన ఆరోపణలు చేశారు.

# సిరిసిల్ల కలెక్టర్ ట్రాన్స్‌ఫర్

**టీజీఎస్ ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి అపాయింట్**

**సిరిసిల్లలో కొంతవఖీంది ప్రజల సంబురాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): తెలంగాణలో భారీగా ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. ఆరుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, 23 మంది ఐపీఎస్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఆర్టీసీ ఎండీగా పని చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ సీపీగా ఉన్న సీవీ ఆనంద్‌ను హోంశాఖ ప్రధాన కార్యదర్శిగా అపాయింట్ చేసింది ప్రభుత్వం. మొన్నటి వరకు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న శివధర్ రెడ్డి డీజేపీగా బాధ్యతలు చేపట్టడంతో ఇంటెలిజెన్స్ బాధ్యతలను విజయ్ కుమార్‌కు అప్పగించింది ప్రభుత్వం. ఫైర్ డీజీగా పని చేస్తోన్న నాగిరెడ్డిని ఆర్టీసీ ఎండీగా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇటీవల వరుస వివాదాలల్లో చిక్కుకుంటున్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆయనను స్పెషల్ సెక్రటరీగా నియమించింది. రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా హరిత నియమితులయ్యారు.

### బదిలీలు ఇలా..

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్
ఇంటెలిజెన్స్ చీఫ్‌గా విజయ్ కుమార్
హోంశాఖ సెక్రటరీగా సీవీ ఆనంద్
ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా రఘునందన్ రావు
వ్యవసాయ శాఖ కార్యదర్శిగా సురేంద్ర మోహన్
జీఏడీ పొలిటికల్ సెక్రటరీగా రిజ్వీ
విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా శిఖా గోయల్
గ్రేహౌండ్స్ ఏడీజీగా అనిల్ కుమార్
పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా స్టీఫెన్ రవీంద్ర
ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి
ఫైర్ డీజీగా విక్రమ్ సింగ్
హైదరాబాద్ క్రైమ్ అడిషనల్ సీపీగా శ్రీనివాసులు
హైదరాబాద్ అడిషనల్ శాంతిభద్రతలను సీపీగా తసఫీర్ ఇక్బాల్
వెస్ట్ జోన్ డీసీపీగా సీహెచ్ శ్రీనివాస్
సిద్దిపేట సీపీగా విజయ్ కుమార్
నారాయణ పేట్ ఎస్పీగా వినీత్
ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా సింధు శర్మ
రాజేంద్ర నగర్ డీసీపీగా యోగేష్ గౌతమ్
మాదాపూర్ డీసీపీగా రితిరాజ్
ఎల్బీ నగర్ డీసీపీగా అనురాధ

### సిరిసిల్లలో సంబురాలు

సిరిసిల్ల, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): నిత్యం వివాదాల్లో నిలిచిన రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై ప్రభుత్వం వేటు వేసిన నేపథ్యంలో పట్టణంలోని విద్యానగర్‌లో ఓ ఆలయంలో కొబ్బరికాయలు కొట్టిన నాయకులు, పటాకులు కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ఐఏఎస్ ఆఫీసర్లు బదిలీ కాగా, అందులో సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కూడా ఉన్నారు. ఆయనను టీఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శిగా ట్రాన్స్‌ఫర్ చేసింది. సందీప్ కుమార్ స్థానంలో సిరిసిల్ల కలెక్టర్‌గా ఎం హరితను నియమించారు. వీరితో పాటు మొత్తం ఆరుగురు ఐఏఎస్‌లు బదిలీ కాగా, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాణిజ్య పన్నుల కమిషనర్‌గా ఎం రఘునందన్ రావు బదిలీ అయ్యారు. రవాణా శాఖ కమిషనర్‌గా కూడా రఘునందన్ రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వ్యవసాయ శాఖ కమిషనర్‌గా కే సురేంద్ర మోహన్, జీఏడీ ముఖ్య కార్యదర్శిగా రిజ్వీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా కే హరిత నియామకం అయ్యారు.

## విద్య, ఉద్యోగవాణి

### ఏపీపీసెట్ తుది విడుత కౌన్సెలింగ్ షెడ్యూల్

బీపీఈడీ, డీపీఈడీ ప్రవేశాలకు సంబంధించి ఆచార్య నాగార్జున వర్సిటీ పీసెట్ తుది విడత వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను రిలీజ్ చేసింది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 3 వరకు రిజిస్ట్రేషన్, సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 4 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, అక్టోబర్ 5 నుండి 6 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, 8న వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం ఇచ్చింది. 10న సీట్లు కేటాయించనుండగా, 12, 13 తేదీల్లో విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలని తెలిపింది.




## 60 ఏళ్ల తర్వాత

# ఉస్మాన్ సాగర్‌కు భారీ వరద

**గేట్లు ఎత్తి మూసీలోకి నీరు విడుదల చేశాం: జలమండలి ఎండీ**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): ఆరు దశాబ్దాల అనంతరం ఉస్మాన్ సాగర్‌కు భారీ వరద వచ్చిందని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కారణంగానే 15 గేట్లు ఎత్తి మూసీ నదిలోకి వరద నీటిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లాలో కురిసిన విస్తారమైన వర్షాల ఫలితంగా గంటల వ్యవధిలోనే గండిపేటకు 16 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందితో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ మూసీలోకి నీటిని విడుదల చేసినట్లు ఆయన వివరించారు. డ్యామ్ నిర్మాణం సమయంలోనే ఎంత వరద వస్తే ఎంత నీటిని విడుదల చేయాలనే సాంకేతిక అంశాలను స్పష్టంగా పొందుపరిచినట్లు ఆయన తెలిపారు. ఆ సూచనల ఆధారంగానే గండిపేట గేట్లను ఎత్తినట్లు ఆయన స్పష్టం చేశారు. గత పాతికేళ్లలో శంకర్‌పల్లి వంతెన వద్ద నీటి మట్టం 10 అడుగులు కూడా దాటలేదని, కానీ ఈసారి ఏకంగా 16.5 అడుగులకు చేరుకుందని ఆయన వెల్లడించారు. వరద ఉద్ధృతిని అంచనా వేసి నీటిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా అందుతున్న సమాచారంతో పాటు, వాతావరణ శాఖ అందించిన డేటా ఆధారంగా ఎగువ ప్రాంతాల్లోని పరిస్థితిని అంచనా వేసి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు ఆయన వివరించారు.



## ఆవుకు సీమంతం

**బంధువులను పిలిచి వేడుక**

**వరంగల్ జిల్లా దాసరపల్లిలో సంఘటన**

నర్సంపేట, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): వరంగల్ జిల్లా నర్సంపేట మండలం దాసరిపల్లిలో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెండ్యాల సురేందర్, ఆయన భార్య తమ ఇంట్లో కుటుంబ సభ్యురాలిగా పెంచుకుంటున్న ఆవు గర్భం దాల్చడంతో బంధుమిత్రులను పిలిచి ఘనంగా సీమంతం నిర్వహించారు. సురేందర్ గోపాలమిత్రగా పనిచేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం హనుమకొండలోని మహర్షి గోశాల నుంచి ఆయన ఒక ఆవుదూడను స్వీకరించారు. ఆడపిల్లలు లేని లోటును పూడ్చుకోవడానికి ఆ ఆవుదూడకు గౌరి అని పేరుపెట్టి కుటుంబ సభ్యురాలిగా చూసుకుంటున్నారు. ఇటీవల గౌరి గర్భం దాల్చడంతో సొంత కూతురుకు జరిపించినట్లు సీమంతం జరిపించారు. బంధుమిత్రులను ఆహ్వానించి శుక్రవారం సంప్రదాయ పద్ధతిలో వేడుక నిర్వహించారు. ఐదు రకాల పిండి వంటకాలు, పండ్లు, పూలను ముత్తయిదువలతో ఆవుకు పెట్టించారు. గోమాత ప్రాముఖ్యం అందరికీ తెలిసేలా ఈ వేడుకను నిర్వహించామని సురేందర్ తెలిపారు.

# ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డు

**మాజీ మంత్రి కేటీఆర్ వెల్లడి.. తెలంగాణ భవన్ లో బాకీ కార్డు విడుదల**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): ఎన్నికల ముందు రజనీకాంత్‌లా.. ఎన్నికలయ్యాక గజినీకాంత్ లా మారిపోయాడు: హరీశ్ రావు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందని, ఏ వర్గానికి ఎంతెంత బాకీ పడిందనే వివరాలను చాటిచెప్పేందుకే బాకీ కార్డును తీసుకొచ్చామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పార్టీ ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్ లో కాంగ్రెస్ బాకీ కార్డును విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీసి తమ బాకీని వసూలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్డును తెలంగాణలోని ఇంటింటికీ చేరుస్తామని చెప్పారు. తమపై కేసులు నమోదు చేసినా సరే వెనుకాడబోమని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలందరికీ గుర్తుచేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, స్వామి గౌడ్, పద్మారావు గౌడ్, మధుసూదనాచారి, జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు రజినీకాంత్ లా.. అధికారంలోకి వచ్చాక గజినీకాంత్ లాగా మారిపోయాడని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఆయన చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డి కాదు, కటింగ్ మాస్టర్ రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు.




గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులకు రిబ్బన్ కటింగ్ లు చేసి ప్రారంభోత్సవాలు చేస్తున్నాడని, అదే సమయంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన పలు మంచి పథకాలను కట్ చేశాడని హరీశ్ రావు ఆరోపించారు. మహిళలకు రూ.2500 హామీ కింద ఒక్కొక్కరికి రూ.55 వేలు, వృద్ధులకు పెన్షన్ నెలకు రూ.4 వేల హామీ కింద ఒక్కొక్కరికి రూ.44 వేలు, వికలాంగులకు పెన్షన్ రూ.6 వేల హామీ కింద ఒక్కొక్కరికి రూ.44 వేలు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, విద్యార్థినులకు స్కూటీ, విద్యా భరోసా కార్డ్ కింద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడినట్లు బీఆర్ఎస్ నేతల ఈ బాకీ కార్డులో ఆరోపించారు.

## రైతు దగ్గర రూ.10 వేల లంచం!

**ఏసీబీకి చిక్కిన టెక్నికల్ అసిస్టెంట్**



మంచిర్యాల, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల కేంద్రంలో ఓ రైతు నుండి పదివేల రూపాయల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడో అధికారి. కన్నెపల్లి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంజూరైన పశువుల పాక (షెడ్డు) నిర్మాణం పూర్తిచేసిన ఓ రైతు నుండి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ లో పనిచేసే టెక్నికల్ అసిస్టెంట్ బానోతు దుర్గాప్రసాద్ పదివేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు అవినీతి నిరోధక శాఖ ఆదిలాబాద్ డిఎస్పి మధు తెలిపారు. వివరాల్లోకెళ్తే మండల కేంద్రంలోని గోమాస కిష్టయ్య అనే రైతు ఉపాధి హామీ పథకంలో తనకు మంజూరైన పశువుల పాక నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఉపాధి హామీలో పశువులపాక నిర్మాణం కొరకు నిధులు మంజూరు అయ్యాయి. ఆ పనికి సంబంధించిన వర్క్ ఐడి నుండి మొదటి విడతగా 48 వేల రూపాయల బిల్లును రైతుకు చెల్లించారు. రెండవ దపా బిల్లు కోసం 15 వేల రూపాయలు లంచం ఇస్తే రెండో బిల్లుని ఎంబి రికార్డు చేస్తానని ఉపాధి హామీ పథకంలో పని చేసే టెక్నికల్ అసిస్టెంట్ భానోతు దుర్గాప్రసాద్ రైతుని లంచం డిమాండ్ చేయడంతో ఆయన అంత ఇచ్చుకోలేని పదివేల రూపాయలు చెల్లిస్తానని చెప్పి ఎసిబి అధికారులను ఆశ్రయించారు. శనివారం రైతు ఇంటి వద్దకి వెళ్లి పదివేల రూపాయల లంచం తీసుకుంటుండగా టిఏ దుర్గాప్రసాద్ ను ఏసిబి ఆదిలాబాద్ డీఎస్పీ మధు బృందం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అతన్ని ఆధీనంలోకి తీసుకొని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. ఏసిబికి పట్టుబడిన వ్యక్తిని శనివారం కరీంనగర్ ఏసిబి కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఆయన తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064 కి లేదా 9154388963 కి సమాచారం అందించాలని తెలిపారు.

## నేడు గ్రూప్-2 ఫలితాలు విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): తెలంగాణ గ్రూప్-2 అభ్యర్థులకు గుడ్ న్యూస్. గ్రూప్-2 ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఆదివారం గ్రూప్-2 ఫలితాలు విడుదల కాబోతున్నాయి. 783 పోస్టుల తుది ఫలితాలను ఆదివారం మధ్యాహ్నం రిలీజ్ చేయాలని టీజీపీఎస్సీ నిర్ణయం తీసుకుంది. దసరా పండుగలోపే తుది ఫలితాలు ప్రకటించి నియామక పత్రాలు అందజేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

# స్కిల్ ఉంటేనే శాలరీ

**నైపుణ్యాలతోనే ఉద్యోగాలు.. స్కిల్స్ లేకే నిరుద్యోగం.. ఏటీసీ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): సాఫ్ట్‌వేర్ కోర్సులతోనే విదేశాల్లో ఉద్యోగాలు వస్తాయని భావించరాదని, ఏటీసీలో శిక్షణ పొంది జర్మనీలో నెలకు రూ. 3.50 లక్షల వేతనం పొందుతున్న వారు ఉన్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మల్లేపల్లి ఐటీసీ ప్రాంగణంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2034 నాటికి తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యాలు కూడా అవసరమని ఆయన నొక్కి చెప్పారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించడం కోసం టాటా టెక్నాలజీస్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి సహకారంతోనే ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. ఆటోమొబైల్ రంగంలో విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, కానీ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు యువతలో కొరవడ్డాయని ఆయన పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన ఉద్యోగులు లభించడం లేదని పలు కంపెనీలు చెబుతున్నాయని అన్నారు. రూ. 2,400 కోట్ల వ్యయంతో 65 ఏటీసీలను ఏర్పాటు చేశామని, ఒక్కో కేంద్రంలో సుమారు 200 మంది ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు. ఈ కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న వారందరికీ ఉద్యోగాలు లభిస్తున్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో మరో 51 ఏటీసీలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రాల్లో శిక్షణ పొందే విద్యార్థులకు ప్రతి నెల రూ. 2 వేల స్టైఫండ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. నిరుద్యోగుల పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని, రాష్ట్రం ఏర్పడిన తరువాత పదేళ్లు గడిచినా యువత ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు, సాంకేతిక నైపుణ్యం మాత్రమే మన భవిష్యత్తును మారుస్తాయని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రోజుల్లో సాంకేతిక నైపుణ్యం తప్పనిసరి అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గంజాయి కేసుల్లో అధికంగా ఇంజినీరింగ్ విద్యార్థులే పట్టుబడటం దురదృష్టకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు. గంజాయికి బానిసలై విద్యార్థుల తల్లిదండ్రులకు బాధ కలిగించవద్దని హితవు పలికారు.



## తల్లిదండ్రులను చూసుకోకపోతే జీతం కట్

**గ్రూప్-1 విజేతలకు రేవంత్ రెడ్డి హెచ్చరిక**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల వేతనంలో 10 శాతం వారికి చెల్లించేలా చట్టం తీసుకువస్తామని గ్రూప్-1కు ఎంపికైన ఉద్యోగులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో గ్రూప్-1 విజేతలకు ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గ్రూప్-1 పరీక్షలకు మూడు లక్షల మందికి పైగా పోటీ పడిగా 562 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన ఉద్యోగులెవరూ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఒకవేళ తల్లిదండ్రులను పట్టించుకోని పక్షంలో వారి వేతనంలో 10 శాతం తల్లిదండ్రులకు అందేలా చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, తాను డబ్బులు తీసుకుని గ్రూప్-1 ఉద్యోగాలు అమ్ముకున్నానని కొందరు దుష్ప్రచారం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుట్ర వెనుక కోచింగ్ సెంటర్ల హస్తం ఉందని ఆయన ఆరోపించారు. పదేళ్లు తెలంగాణ ప్రజలు అవకాశమిస్తే బీఆర్ఎస్ నేతలు విశ్వాసఘాతకులుగా మిగిలిపోయారని ఆయన విమర్శించారు.

## చిరంజీవి చెప్పిందే కరెక్ట్

**జగన్ ఎవరినీ అవమానించలేదు**

**బాలకృష్ణ వ్యాఖ్యలపై ఆర్.నారాయణమూర్తి**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): ఏపీ అసెంబ్లీ సాక్షిగా చిరంజీవిపై హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. దీనిపై చిరంజీవి కూడా ఘాటుగా స్పందించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలోనే ఈ వివాదంపై సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి స్పందించారు. జగన్ ప్రభుత్వం సినిమా వాళ్లు ఎవరినీ అవమానించలేదని కుండబద్ధలు కొట్టారు. ఏపీ అసెంబ్లీలో బాలకృష్ణ చేసిన కామెంట్స్‌పై చిరంజీవి స్పందన 100 శాతం నిజమని ఆర్.నారాయణమూర్తి తెలిపారు. జగన్‌ను కలిసిన వాళ్లలో తాను కూడా ఉన్నానని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం ఎవరినీ అవమానించలేదని స్పష్టం చేశారు. చిరంజీవి ఆధ్వర్యంలో జగన్‌మోహన్ రెడ్డిని కలిసినప్పుడు ఆయన ఎంతో గౌరవమిచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం చిరంజీవిని, సినిమా వాళ్లను అవమానించారనే ప్రచారం అసత్యమని పేర్కొన్నారు. చిరంజీవి నాకు స్వయంగా ఫోన్ చేశారు.. అది ఆయన సంస్కారమని ఆర్.నారాయణమూర్తి అన్నారు. అందరం చిరంజీవి ఇంట్లో కలిశాం. అనంతరం చిరంజీవి పరిశ్రమ పెద్దగా అప్పటి సీఎం జగన్‌తో మాట్లాడారని తెలిపారు. చిరంజీవి వల్లే ఆరోజు సమస్య పరిష్కారమైందని చెప్పారు. ఇంకా ఇండస్ట్రీలో ఉన్న సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

# వరద బాధితులకు అండగా ఉండండి

**జనసేన శ్రేణులకు, అభిమానులకు పవన్ పిలుపు**

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొని, బాధితులకు అండగా నిలవాలని తెలంగాణ జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయిందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా, హైదరాబాద్‌లో మూసీ నదికి వరద పోటెత్తడంతో మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) సహా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో వరద బాధితులకు మనోధైర్యం కల్పించడం అత్యవసరమని ఆయన అన్నారు. జనసేన శ్రేణులు తక్షణమే స్పందించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. బాధితులకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ వారికి ధైర్యం చెప్పాలని సూచించారు. ఇదే సమయంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టిందని పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న సహాయక కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా జనసైనికులు తమ వంతు సాయం అందించాలన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం జారీ చేసే సూచనలతో పాటు వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సోషల్ వాణి



వాహ్ రేవంత్ రెడ్డి వావ్.. రేవంత్ రెడ్డి ఏం గేమ్ ఆడారు.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని నమ్మ బలికినవ్. ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీకి దగ్గరై నీకు, నీ సోదరులకు అత్యంత సన్నిహితంగా ఉంటున్న రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డితో బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా హైకోర్టు కేసు పెట్టించినవ్. అమాయక బీసీలను వంచించి వారి ఉసురు పోసుకుంటున్నవ్. కానీ ఒక్కటి మాత్రం నిజం. నీ డ్రామాలు నమ్మే స్థితిలో ప్రజల లేరు. రాబోయే స్థానిక ఎన్నికల్లో నీకు నీ పార్టీకి రాజకీయంగా బుద్ధి చెప్పి తీరుతరు.

- రఘువీర్ రాథోడ్







# ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ వెల్లడి**

**కలెక్టరేట్ లో ఘనంగా బతుకమ్మ సంబురాలు**

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): బతుకమ్మ పండుగ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్.. మహిళలు సమిష్టిగా బతుకమ్మ ఆడటం వల్ల సాంఘిక ఐక్యత బలపడుతుందని అన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనడం అనందంగా ఉందన్నారు. అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీడబ్ల్యూవో నరేశ్, మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వేములవాడలో ఘనంగా సద్దుల బతుకమ్మ

వేములవాడ, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో శనివారం సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగే పండుగకు భిన్నంగా ఇక్కడ ఏడు రోజులకే సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఆడపడుచులు, చిన్నారులు ఉత్సాహంగా సంబురాలు చేసుకున్నారు. బతుకమ్మ పాటలతో, డీజే చప్పుళ్ల మధ్య బతుకమ్మను గంగమ్మ ఒడికి చేర్చారు.

# ఉద్యమాల ఊపిరి కొండా లక్ష్మణ్ బాపూజీ

**ఆయన ఆశయాల సాధనకోసం కృషి చేయాలి.. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**



జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): ఉద్యమాల ఊపిరి కొండా లక్ష్మణ్ బాపూజీ అని జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ కొనియాడారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు, హైదరాబాద్ సంస్థాన ప్రజలకోసం నిజాంను ఎదిరించిన యోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక న్యాయం కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారాలను ప్రతిభావంతులైన చేనేత కళాకారులను ప్రోత్సహించేదుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, బీ రాజా గౌడ్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్, జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, ఏవో హకీం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


**ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన**

# పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా



విజయవాడ, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): పర్యాటక రంగంతోనే రాష్ట్రంలో సమూల మార్పులు తీసుకొచ్చి, ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పర్యాటక రంగం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పిస్తున్నట్లు కీలక ప్రకటన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పర్యాటక ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు తెలిపారు. "ప్రస్తుతం నిలిచి ఉండే ఒకే ఒక్క 'ఇజం' టూరిజం మాత్రమే. ప్రపంచ దేశాలు పర్యాటకం ద్వారా 2.6 ట్రిలియన్ డాలర్ల ఆదాయం పొందుతున్నాయి. వాటితో పోలిస్తే అపారమైన అవకాశాలున్న మన దేశం, ముఖ్యంగా మన రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉంది. 2027 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం" అని అన్నారు. ప్రస్తుతం 8 శాతంగా ఉన్న పర్యాటక రంగ వృద్ధిని 20 శాతానికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యాటక పెట్టుబడులను ఆకర్షించేందుకు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో వేగంగా అనుమతులు, ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే రూ.10,600 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని గుర్తు చేశారు. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, రానున్న మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కొత్త హోటల్ గదులను అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. అలాగే, అరకు, పాడేరు, విశాఖ, తిరుపతి, రాయలసీమ వంటి పర్యాటక ప్రాంతాల్లో 10 వేల హోం స్టేలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంపై ఈ సందర్భంగా చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. "రుషికొండపై రూ.450 కోట్లతో ప్యాలెస్ నిర్మించి ప్రజాధనాన్ని వృథా చేశారు. అదే మొత్తాన్ని పర్యాటక రంగంపై ఖర్చు చేసి ఉంటే లక్షల మందికి ఉద్యోగాలు లభించేవి. వారికి పాలనపై అవగాహన లేదు" అని ఆరోపించారు. రాష్ట్రంలోని సాంస్కృతిక, చారిత్రక సంపదను పర్యాటకంగా మలుస్తామని చంద్రబాబు వివరించారు. అమెరికాలోని గ్రాండ్ కానియన్‌కు దీటుగా గండికోట, గుజరాత్‌లోని కచ్ తరహాలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తిరుమల, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాల్లో 'వెడ్డింగ్ డెస్టినేషన్స్' ఏర్పాటు చేసే ఆలోచన ఉందని తెలిపారు. మైసూరు, కోల్‌కతా నగరాల సరసన నిలిచేలా విజయవాడలో దసరా ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యమిస్తామని, కూచిపూడి, థింసా వంటి కళారూపాలను, అరకు కాఫీ వంటి స్థానిక ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# మానవత్వమే ముఖ్యం: నాదెండ్ల



అమరావతి, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): కొల్లేరు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిబంధనల చట్రంలో చూడకుండా, మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల కన్నా మానవత్వమే ముఖ్యం అని స్పష్టం చేశారు. కొల్లేరు వాసుల కనీస అవసరాలైన తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనలో అటవీ శాఖ అధికారుల తీరుపై జిల్లా ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో, ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది. శనివారం నాడు సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్.. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను మంత్రుల ఎదుట ఏకరువు పెట్టారు. కొల్లేరు అభయారణ్యం పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు అటవీ శాఖ అధికారులు నిబంధనల పేరుతో అడ్డుపడుతున్నారని, కనీసం జిల్లా స్థాయి సమీక్షా సమావేశాలకు కూడా హాజరుకావడం లేదని వారు ఆరోపించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ, లంక గ్రామాల్లో ప్రజలు తీవ్రమైన తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నారని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# 4న ఆటోడ్రైవర్లకు 15 వేలు

**శుభవార్త చెప్పిన ఏపీ సీఎం చంద్రబాబు**

అమరావతి, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): రాష్ట్రంలోని లక్షలాది మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త అందించారు. అర్హులైన ప్రతి డ్రైవర్‌కు రూ.15,000 చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. వచ్చే నెల (అక్టోబర్) 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఈ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 2.9 లక్షల మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు ప్రయోజనం పొందనున్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 'సూపర్ సిక్స్' పథకాలు, ఎన్డీయే కూటమి మేనిఫెస్టో హామీల అమలుపై జరిగిన చర్చలో భాగంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. అర్హత ఉన్న ప్రతి డ్రైవర్‌ను ప్రభుత్వం ఆదుకుంటుందని, వారి సంక్షేమానికి అన్ని చర్యలూ తీసుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. "ఈ పథకానికి అర్హులుగా 2,90,234 మంది డ్రైవర్లు ఉన్నారు. ఏదైనా కారణాలతో లబ్ధిదారుల జాబితాలో అర్హులైన వారి పేరు లేకపోతే... వారి సమస్యలను పరిష్కరించి వారినీ లబ్ధిదారుల జాబితాలో చేరుస్తాం. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆటో డ్రైవర్ల సేవలో స్కీంను వర్తింపచేస్తాం. ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి యేటా రూ.435 కోట్ల ఖర్చు అవుతుంది. గత ప్రభుత్వం రూ.12 వేలు మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.15 వేలు అందించేందుకు నిర్ణయించింది" అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు సంబంధించిన మరో ముఖ్యమైన విషయాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న చలాన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమస్యలు ఉన్న డ్రైవర్లు వాటిని క్లియర్ చేసుకున్న వెంటనే వారికి కూడా ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.



# ఎమ్మెల్యేలు గీత దాటొద్దు

**ఏపీ సీఎం చంద్రబాబు హెచ్చరిక.**

అమరావతి, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): 'డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంది కాబట్టే 15 నెలల్లో ఇన్ని కార్యక్రమాలు చేయగలిగాం. ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్ సహకారంతో ఈ ప్రభుత్వం ఒక టీంలా పనిచేస్తోంది. ఈ టీంలో ఏ ఒక్కరు తప్పు చేసినా, విఘాతం కలిగించేలా వ్యవహరించినా రాష్ట్రానికే నష్టం జరుగుతుంది. ఎమ్మెల్యేలు వ్యక్తిగత అజెండాలు పెట్టుకుని మాట్లాడితే అభివృద్ధి లక్ష్యానికి ఆటంకం కలుగుతుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి' అని ఏపీ సీఎం చంద్రబాబు కూటమి ఎమ్మెల్యేలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. శాసనసభలో నేడు 'సూపర్ సిక్స్', ఇతర మేనిఫెస్టో హామీల అమలుపై జరిగిన చర్చలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వ ప్రగతిని వివరించారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ముఖ్యమంత్రి అంకెలతో సహా వివరించారు. "ఎంతో ఆలోచించి పింఛన్ల పథకానికి 'పేదల సేవలో' అని పేరు పెట్టాం. ఈ కార్యక్రమం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది" అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 63.50 లక్షల మందికి ప్రతినెలా రూ.2,745 కోట్లు ఖర్చు చేస్తూ పింఛన్లు అందిస్తున్నామని, ఇందులో 59 శాతం మహిళలే ఉన్నారని తెలిపారు. ఏడాదికి రూ.32,143 కోట్లతో దేశంలోనే అత్యధికంగా పింఛన్లపై ఖర్చు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని, మన తర్వాత ఉన్న తెలంగాణ, కేరళ రాష్ట్రాలు మన ఖర్చులో పావు వంతు మాత్రమే చేస్తున్నాయని పోల్చి చెప్పారు. సచివాలయ సిబ్బంది కృషితో తొలిరోజే 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తవుతోందని అభినందించారు. మహిళల అభ్యున్నతికి అమలు చేస్తున్న పథకాల గురించి చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "స్త్రీ శక్తి పథకం నాకు అత్యంత సంతృప్తినిచ్చింది. ఈ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 8.86 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు చేశారు. దీనివల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది. ఏటా రూ.2,963 కోట్లు ఖర్చయినా ఆనందంగా భరిస్తాం" అని అన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు ఆర్థికంగా ఆదాతో పాటు, సామాజికంగానూ మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. 'తల్లికి వందనం' పథకం కింద 66.57 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు అందించామని, ఇంకా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 'దీపం-2.0' పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని, ఇప్పటివరకు 2.66 కోట్ల సిలిండర్లు పంపిణీ చేశామని తెలిపారు. రాష్ట్రంలో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే లక్ష్యమని, ఈ బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.




# పారదర్శకంగా 'స్థానిక' రిజర్వేషన్లు

**జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి**

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను పారదర్శకంగా చేపట్టినట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, వార్డు మెంబర్ల రిజర్వేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజా గౌడ్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పెల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, యన్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో బీ గౌతమ్ రెడ్డి, జిల్లా పంచాయితీ అధికారి మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# బాలకృష్ణ ఇష్యూ డైవర్షన్‌కు అరెస్టు కార్డు

**ఏపీ మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్**

**రాజమండ్రి జైల్లో మిథున్ రెడ్డిని కలిసిన అమర్నాథ్**

రాజమండ్రి, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): ఏపీలో అధికార కూటమి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని, అందులో భాగంగానే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని వేధిస్తోందని వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై, రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని ఈరోజు గుడివాడ అమర్నాథ్, విజయనగరం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ములాఖత్‌లో కలిశారు. అనంతరం అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "రాష్ట్రంలో డైవర్షన్ రాజకీయాలు నడుస్తున్నాయి. బాలకృష్ణ వ్యాఖ్యలతో చెలరేగిన దుమారాన్ని పక్కదారి పట్టించడానికి మరో వైసీపీ నేత ఎవరో ఒకరిని అరెస్ట్ చేస్తారు" అని అమర్నాథ్ ఆరోపించారు. గతంలో కల్తీ లడ్డూ అన్నారని, ఇప్పుడు లిక్కర్ స్కామ్ అంటున్నారని, కానీ ఎక్కడా తమపై అభియోగాలను నిరూపించలేకపోతున్నారని అమర్నాథ్ వ్యాఖ్యానించారు. జైల్లో మిథున్ రెడ్డి చాలా ధైర్యంగా ఉన్నారని, ఇలాంటి కుట్రలను, అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటామని చెప్పారని తెలిపారు. మిథున్ రెడ్డికి ఉత్తరాంధ్ర వైసీపీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# కృష్ణా, గోదావరికి పోటెత్తిన వరద

విజయవాడ, సెప్టెంబర్ 27 (ఈవార్తలు): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏపీలో కృష్ణా, గోదావరి నదులు ఉగ్రరూపం దాల్చాయి. రెండు నదుల్లోనూ వరద ప్రవాహం పోటెత్తడంతో ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజీలు మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువవుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఇప్పటికే 44.9 అడుగులకు చేరింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద పరిస్థితిని అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీలోకి 9.88 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, అదే స్థాయిలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఈ ప్రవాహం 11 నుంచి 12 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కృష్ణానది కూడా పరవళ్లు తొక్కుతోంది. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద 3.74 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో నమోదవుతోంది. రాబోయే గంటల్లో ఇది 4.5 నుంచి 5 లక్షల క్యూసెక్కులకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లోనూ అధికారులు అప్రమత్తత ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ప్రజలకు కీలక సూచనలు చేశారు.



# బీఎస్ఎన్ఎల్ 4జీ షురూ

**ప్రారంభించిన ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ/ఝార్సుగూడ: ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వదేశీ 4జీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చింది. శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. పూర్తి భారతీయ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ 'భారత్ టెలికాం స్టాక్' నెట్‌వర్క్‌ను జాతికి అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టం ద్వారా టెలికాం రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం దిశగా దేశం ఒక కీలక మైలురాయిని అధిగమించింది. ఈ కార్యక్రమంలో భాగంగా, సుమారు రూ.37,000 కోట్ల వ్యయంతో, సౌరశక్తితో పనిచేసే 97,500 మొబైల్ 4జీ టవర్లను ప్రధాని మోదీ ప్రారంభించారు. దేశంలోని ప్రతి గ్రామానికి 4జీ సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన '100 శాతం 4జీ సాచురేషన్ ప్రాజెక్టు'కు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఒడిశాలోని 2,472 గ్రామాలతో సహా దేశవ్యాప్తంగా సరిహద్దు, మారుమూల, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని 26,700కు పైగా గ్రామాలకు తొలిసారిగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో సుమారు 2.2 కోట్ల మంది పౌరులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు దేశీయ టెక్ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ-డాట్), తేజస్ నెట్‌వర్క్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా టీసీఎస్ డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ వంటి బాధ్యతలను నిర్వర్తించగా, సీ-డాట్ కోర్ అప్లికేషన్‌ను, తేజస్ నెట్‌వర్క్స్ బేస్ స్టేషన్లు, రేడియో పరికరాలను అందించాయి. లక్షకు పైగా సైట్లలో ఈ స్వదేశీ పరికరాలను విజయవంతంగా నెలకొల్పారు. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనది కావడంతో, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసేందుకు వీలుంటుందని అధికారులు తెలిపారు. ఈ విజయంతో, సొంతంగా 4జీ, ఆపై టెక్నాలజీలను అభివృద్ధి చేసిన డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా వంటి అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది. టెలికాం పరికరాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి, జాతీయ భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలక ముందడుగు అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జె. రవి మాట్లాడుతూ, "ఇది జాతి గర్వించదగ్గ చారిత్రాత్మక విజయం. టీసీఎస్, తేజస్ నెట్‌వర్క్స్, సీ-డాట్ భాగస్వామ్యంతో నిర్మించిన మా స్వదేశీ 4జీ నెట్‌వర్క్, ఆత్మనిర్భర్ భారత్ నినాదానికి నిలువుటద్దం" అని అన్నారు. టీసీఎస్ సలహాదారు, తేజస్ నెట్‌వర్క్స్ ఛైర్మన్ ఎన్. గణపతి సుబ్రమణియం మాట్లాడుతూ, "సొంతంగా టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేసిన అతికొద్ది దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడం మాకు గర్వకారణం. బీఎస్ఎన్ఎల్‌లో ఈ నెట్‌వర్క్‌ను విజయవంతంగా వ్యవస్థీకృతం చేయడం దేశంలోని ప్రతి మూలకు శక్తివంతమైన డేటా, వాయిస్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లడంలో చరిత్రాత్మకమైనది" అని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్య, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, 24 గంటల టెలిమెడిసిన్ వంటి సేవలు అందుబాటులోకి రావడానికి ఈ నెట్‌వర్క్ దోహదపడుతుంది. ప్రధాని మోదీ కలలు కన్న 'డిజిటల్ ఇండియా' లక్ష్య సాధనలో ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ఒక మైలురాయిగా నిలిచిపోతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## ఆమెను తొలగిస్తే సరి.. లేకపోతే!

**మైక్రోసాఫ్ట్‌కు ట్రంప్ అల్టిమేటం**

న్యూయార్క్: మైక్రోసాఫ్ట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఆ సంస్థలో గ్లోబల్ అఫైర్స్ హెడ్‌గా పనిచేస్తున్న లీసా మొనాకోను తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. లీసా మొనాకో ఒక "అవినీతిపరురాలు" అని, ఆమె "అమెరికా జాతీయ భద్రతకు పెను ముప్పు" అని ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రభుత్వం నుంచి మైక్రోసాఫ్ట్ కీలక కాంట్రాక్టులు పొందుతోంది. అలాంటి సంస్థలో ఉన్న లీసాకు అత్యంత సున్నితమైన సమాచారం అందుబాటులో ఉంటుంది. ఆమెను అస్సలు నమ్మలేం" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా, తాను ఇప్పటికే మొనాకోకు ఉన్న భద్రతా అనుమతులను రద్దు చేశానని, ప్రభుత్వ కార్యాలయాల్లోకి ఆమె ప్రవేశాన్ని నిషేధించానని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది మే నెలలోనే లీసా మొనాకో మైక్రోసాఫ్ట్‌లో చేరారు. అంతకుముందు ఆమె జో బైడెన్ ప్రభుత్వంలో 39వ డిప్యూటీ అటార్నీ జనరల్‌గా అటార్నీ జనరల్ మెరిక్ గార్లాండ్ కింద పనిచేశారు. బైడెన్ యంత్రాంగంలో కీలక బాధ్యతలు నిర్వర్తించడమే ప్రస్తుతం ట్రంప్ ఆగ్రహానికి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, మైక్రోసాఫ్ట్‌లో ఆమె పాత్ర గురించి ట్రంప్ దృష్టికి ఇప్పుడే వచ్చి ఉండవచ్చని, అందుకే ఈ సమయంలో ఆమెను లక్ష్యంగా చేసుకున్నారని కొన్ని నివేదికలు అభిప్రాయపడ్డాయి. ఇటీవలి కాలంలో హెచ్1బీ వీసాలపై ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో మైక్రోసాఫ్ట్ వంటి టెక్ కంపెనీలు అసంతృప్తిగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నెల 21 నుంచి హెచ్1బీ వీసాలపై లక్ష డాలర్ల ఫీజు అమల్లోకి రానుండటంతో విదేశాల్లో ఉన్న తమ ఉద్యోగులు వెంటనే వెనక్కి వచ్చేయాలని మైక్రోసాఫ్ట్ సూచించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## పాక్‌లో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోనూ దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఇస్లామిక్ దేశమైన పాకిస్థాన్‌లోని వీధుల్లో హిందువులు గర్బా, దాండియా నృత్యాలతో హోరెత్తించిన దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వేడుకలను చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు. పాకిస్థాన్‌లో నివసిస్తున్న ప్రీతమ్ దేవ్రియా అనే హిందూ యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఒక వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ వీడియోలో, విద్యుత్ దీపాలతో అలంకరించిన ఒక వీధిలో దుర్గామాత చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. యువతులు, పురుషులు సంప్రదాయ దుస్తులు ధరించి గర్బా, దాండియా ఆడుతూ పండుగను ఉత్సాహంగా జరుపుకోవడం కనిపిస్తోంది.

## అడ్మిషన్‌కు పరీక్షలేంది?

**అది రాజ్యాంగ విరుద్ధం**

**సుప్రీం మెట్లెక్కిన 11 ఏళ్ల బాలుడు**




న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షల విధానాన్ని సవాలు చేస్తూ, ఓ 11 ఏళ్ల బాలుడు ఏకంగా సుప్రీంకోర్టు తలుపు తట్టాడు. ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీఎం శ్రీ పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంట్రన్స్ టెస్ట్‌లు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ జన్మేశ్ సాగర్ అనే విద్యార్థి సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. వివరాల్లోకి వెళితే, ఢిల్లీ ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం శ్రీ పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ పరీక్షలు ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం-2009 స్ఫూర్తికి విరుద్ధమని జన్మేశ్ తన పిటిషన్‌లో స్పష్టం చేశాడు. తాను 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నానని, జులై 23న ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మేరకు సెప్టెంబర్ 13న పరీక్ష కూడా రాశానని తెలిపాడు. అయితే, ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ఎలాంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించరాదని విద్యాహక్కు చట్టం స్పష్టంగా చెబుతోందని పిటిషన్‌లో గుర్తుచేశాడు. ఈ ప్రవేశ పరీక్షల విధానం వల్ల పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేసి, పరీక్షలకు బదులుగా లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించాలని కోరాడు. మరోవైపు, జాతీయ విద్యా విధానం ప్రకారం ఈ సీఎం శ్రీ పాఠశాలలను ప్రత్యేక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు దిల్లీ ప్రభుత్వం చెబుతోంది. అయినప్పటికీ, విద్యాహక్కు చట్టంలోని ప్రాథమిక నిబంధనలను ఈ పాఠశాలలు కూడా పాటించాల్సిందేనని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తున్నారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు త్వరలో విచారణ చేపట్టే అవకాశం ఉంది.

## సైన్యంతో కలిసి పనిచేస్తే తప్పేంటి?

**పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా అసిఫ్**



ఇస్లామాబాద్: ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం, మానవ హక్కుల విషయంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్, తమ దేశంలోని పాలనా వ్యవస్థను గట్టిగా సమర్థించుకుంది. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా అసిఫ్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తమ దేశంలో సైన్యం, పౌర ప్రభుత్వం కలిసి పనిచేసే 'హైబ్రిడ్ మోడల్' పాలనను సమర్థించారు. అంతేకాకుండా అమెరికా పాలనా వ్యవస్థను 'డీప్ స్టేట్' అంటూ విమర్శించడం గమనార్హం. బ్రిటిష్-అమెరికన్ జర్నలిస్ట్ మెహదీ హసన్‌తో జరిగిన ముఖాముఖిలో ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. "పాకిస్థాన్‌లో సైన్యం, పౌర నాయకులు అధికారాన్ని పంచుకుంటారు. కానీ అసలైన అధికారం సైన్యం చేతిలోనే ఉంటుంది కదా? రక్షణ మంత్రిగా మీరు ఆర్మీ చీఫ్‌కు జవాబుదారీగా ఉంటారు. మీ కంటే ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ శక్తిమంతుడు కాదా?" అని మెహదీ హసన్ సూటిగా ప్రశ్నించారు. ఈ వాదనను ఖ్వాజా అసిఫ్ తోసిపుచ్చారు. "అలా ఏమీ లేదు. నేను రాజకీయ నేపథ్యం నుంచి వచ్చిన వాడిని" అని ఆయన బదులిచ్చారు. అమెరికాలో రక్షణ మంత్రి అక్కడి సైనిక జనరల్స్‌ను తొలగించే అధికారం కలిగి ఉంటారని, కానీ పాకిస్థాన్‌లో ఆ పరిస్థితి లేదని జర్నలిస్ట్ గుర్తు చేయగా.. అసిఫ్ ఘాటుగా స్పందించారు. "అమెరికాలో భిన్నమైన వ్యవస్థ ఉంది. దానిని 'డీప్ స్టేట్' అంటారు" అని ఆయన వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లో అధికారం ఎవరి చేతిలో ఉందని పదేపదే ప్రశ్నించగా తమది 'హైబ్రిడ్' వ్యవస్థ అని అసిఫ్ సమాధానమిచ్చారు. దేశంలో నిర్ణయాలన్నీ ఏకాభిప్రాయంతోనే తీసుకుంటామని, ఒకరి మాటే చెల్లుబాటు కాదని ఆయన వివరించారు. దేశ ఆర్థిక, పాలనాపరమైన సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ హైబ్రిడ్ విధానం ఒక ఆచరణాత్మక అవసరమని ఆయన గతంలోనూ అభిప్రాయపడ్డారు. దేశంలో సైన్యం ప్రభావం ఎక్కువగా కనిపించడానికి గత సైనిక పాలకులే కారణమని ఆయన పేర్కొన్నారు.

## ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మస్క్, బిల్ గేట్స్ పేర్లు

**సంచలనం సృష్టిస్తున్న కొత్త పత్రాలు**



న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా బయటపడిన పత్రాల్లో టెక్ బిలియనీర్, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ పేరు ఉండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ ఆరోపణలను మస్క్ తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా అబద్ధమని స్పష్టం చేశారు. డెమొక్రాటిక్ చట్టసభ్యులు విడుదల చేసిన ఆరు పేజీల పత్రంలో ఎప్‌స్టీన్‌కు చెందిన ఒక షెడ్యూల్ వివరాలు ఉన్నాయి. దీని ప్రకారం, 2014 డిసెంబర్ 6న మస్క్.. ఎప్‌స్టీన్‌కు చెందిన వివాదాస్పద ద్వీపానికి (యూఎస్ వర్జిన్ ఐలాండ్స్) వెళ్లాల్సి ఉందని ఒక ప్రణాళికలో పేర్కొన్నారు. ఎందరో మహిళలపై లైంగిక దాడులకు వేదికగా నిలిచిన ఈ ద్వీపానికి మస్క్ ప్రయాణం గురించి ప్రస్తావిస్తూ, ఆయన పేరు పక్కన "ఇది ఇంకా ఖరారైందా?" అని రాసి ఉండటం గమనార్హం. అయితే, ఆ పత్రాల ఆధారంగా మస్క్ నిజంగా ఆ ద్వీపానికి వెళ్లారా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదు. ఈ వార్తలు బయటకు రాగానే ఎలాన్ మస్క్ తన ఎక్స్ ఖాతాలో స్పందించారు. "ఇది అబద్ధం" అని ఒక్క మాటలో కొట్టిపారేశారు. ఈ పత్రాల్లో కేవలం మస్క్ పేరు మాత్రమే కాకుండా మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ట్రంప్ మిత్రుడు స్టీవ్ బానన్ పేర్లు కూడా ఉన్నాయి. 2014 డిసెంబర్ 5న బిల్ గేట్స్‌తో, 2019 ఫిబ్రవరి 16న స్టీవ్ బానన్‌తో ఎప్‌స్టీన్ సమావేశం కావాల్సి ఉందని ఆ షెడ్యూల్‌లో ఉంది. గత కొంతకాలంగా ఎప్‌స్టీన్ ఫైల్స్ మొత్తాన్ని విడుదల చేయాలంటూ ట్రంప్ ప్రభుత్వంపై ఎలాన్ మస్క్ తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఈ కేసులో ఉన్నత స్థాయి వ్యక్తులను, ముఖ్యంగా శక్తిమంతమైన డెమొక్రాట్లను ఎప్‌స్టీన్ బ్లాక్‌మెయిల్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో పూర్తి వివరాలు బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. గతంలో ట్రంప్ పేరు కూడా ఈ ఫైల్స్‌లో ఉందని, అందుకే వాటిని బయటపెట్టడం లేదని మస్క్ ఆరోపించినప్పటికీ, తర్వాత ఆ పోస్ట్‌ను తొలగించారు. "వాగ్దానం చేసినట్లుగా ఫైల్స్‌ను విడుదల చేయండి" అంటూ ట్రంప్‌ను ఉద్దేశించి మస్క్ ఇటీవల వ్యాఖ్యానించడం ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది.



## పాల ఉత్పత్తి పెంచేందుకు ఆవుల మెదడులో చిప్స్

మాస్కో: పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచే లక్ష్యంతో రష్యాకు చెందిన 'నీరీ' అనే సంస్థ సరికొత్త టెక్నాలజీకి శ్రీకారం చుట్టింది. ఆవుల మెదడులో నేరుగా న్యూరో-ఇంప్లాంట్లను (బ్రెయిన్ చిప్స్) అమర్చి, వాటి ద్వారా పాల దిగుబడిని నియంత్రించేందుకు ప్రయోగాలు ప్రారంభించింది. రష్యాలోని స్వెర్డ్‌లోవ్స్క్ ప్రాంతంలో ఇప్పటికే ఐదు ఆవులపై ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించినట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ప్రక్రియలో, ఆవు తల వెనుక భాగంలో ఒక స్టిమ్యులేటర్‌ను అమర్చి, దాని నుంచి వచ్చే ఎలక్ట్రోడ్లను మెదడులోని కీలక భాగాలకు అనుసంధానిస్తారు. ఈ చిప్స్ ద్వారా విద్యుత్ సంకేతాలను పంపి ఆవుల ఆకలి, ఒత్తిడి, పునరుత్పత్తి వ్యవస్థలను నియంత్రించవచ్చని నీరీ సంస్థ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉదాహరణకు, ఒక ఆవుకు ఆకలి మందగిస్తే, ఈ సిస్టమ్ ద్వారా మెదడును ఉత్తేజపరిచి తిరిగి ఆకలి పెరిగేలా చేయవచ్చు. శస్త్రచికిత్స సమయంలో ఆవులు స్పృహలోనే ఉన్నాయని, ప్రక్రియ తర్వాత ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా తిరిగి తమ పనుల్లో నిమగ్నమయ్యాయని రియా నోవోస్టి వార్తా సంస్థ నివేదించింది.

## ఏడవకుండా పెదాలకు గమ్!

**పసిగుడ్డుపై ఓ తల్లి కర్కషత్వం.. అడవిలో వదిలేసి పరార్**

జైపూర్: 19 రోజుల పసికందు పట్ల కన్నతల్లే కసాయిగా ప్రవర్తించింది. బిడ్డను అడవిలో వదిలేసి వెళ్లింది. ఆకలితో బిడ్డ ఏడిస్తే ఎవరైనా గుర్తిస్తారనే భయంతో ఆ పసికందు పెదాలను గమ్‌తో అతికించింది. అక్రమ సంబంధంతో పుట్టినందుకు ఈ దారుణానికి పాల్పడింది. రాజస్థాన్ లోని బిల్వారాలో జరిగిందీ ఘోరం. బిల్వారా అటవీ ప్రాంతంలో రెండు రోజుల క్రితం ఓ పసికందును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. రోజుల పసిగుడ్డు పరిస్థితిని చూసి తీవ్రంగా చలించిపోయారు. పెదాలను గ్లూతో అతికించడంతో ఏడిచేందుకూ వీలులేని పరిస్థితిలో ఉన్న ఆ పసికందును వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించే ఏర్పాట్లు చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టి పాప తల్లిని, తాతను అదుపులోకి తీసుకుని విచారించగా దారుణమైన విషయాలు బయటపడ్డాయి. మహిళ అక్రమ సంబంధం కారణంగా గర్భం దాల్చడంతో ఆమె తండ్రి బుండిలో మారుపేరుతో ఓ గది అద్దెకు తీసుకుని అందులో ఉంచాడు. కాన్పు అయ్యాక పసికందును అమ్మే ప్రయత్నం చేశాడు. అయితే, ఆ ప్రయత్నం విఫలమైంది. దీంతో బిడ్డను తీసుకుని బుల్వారా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. బిడ్డ ఏడుపు ఎవరికీ వినిపించకుండా ఉండాలని పెదాలను గ్లూతో అతికించారు. అక్రమ సంబంధం వల్ల గర్భం దాల్చడంతో ఆ విషయం బయటపడితే కుటుంబానికి చెడ్డపేరు వస్తుందనే కారణంగానే ఈ దారుణానికి పాల్పడినట్లు ఆ తండ్రీకూతుళ్లు వెల్లడించారని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో పసికందు కోలుకుంటోందని వైద్యులు తెలిపారు.

## ఇక్కడ ఉన్నది యోగి!

**ఆ మౌలానా మర్చిపోయారా?.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్**

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో పోలీసులు, స్థానికుల మధ్య జరిగిన హింసాత్మక ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. వ్యవస్థను ఎవరు అడ్డుకున్నా తమ ప్రభుత్వం అమలు చేసే శిక్ష కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. శనివారం జరిగిన 'వికసిత్ యూపీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఐ లవ్ మహమ్మద్" ప్రచారానికి మద్దతుగా నిరసనకు పిలుపునిచ్చిన ఇత్తెహాద్ ఎ మిల్లత్ కౌన్సిల్ చీఫ్ మతాధికారి తౌకీర్ రజా ఖాన్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. "శుక్రవారం ఒక మౌలానా రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నారో మరిచినట్లున్నారు. ఈ వ్యవస్థను ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆపేస్తానని అనుకుంటున్నారేమో. కానీ మేం ఒక విషయం స్పష్టంగా చెప్పదలుచుకున్నాం. రోడ్ల దిగ్బంధం కావొచ్చు, కర్ఫ్యూ కావొచ్చు, అల్లర్లకు పాల్పడే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకునేలా మేం గట్టిగా గుణపాఠం చెప్పి తీరుతాం" అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. రాష్ట్రంలో 2017కు ముందు వ్యవస్థను నిలిపివేసే పరిస్థితి ఉండేదని, కానీ ఆ తర్వాత ఒక్క కర్ఫ్యూని కూడా తాము అనుమతించడం లేదని స్పష్టం చేశారు. అప్పటి నుంచే ఉత్తరప్రదేశ్ అభివృద్ధి కథ మొదలైందని అన్నారు.

## బరేలీలో రాళ్ల దాడి.. 1700 మందిపై కేసు

**ఇస్లాం మత గురువు నిర్బంధం**

**పోలీసులపైకి దూసుకొచ్చిన ఆందోళనకారులు**

బరేలీ: ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో శుక్రవారం ప్రార్థనల అనంతరం చెలరేగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ నిరసనలకు పిలుపునిచ్చిన స్థానిక మత గురువు, ఇత్తెహాద్-ఎ-మిల్లత్ కౌన్సిల్ చీఫ్ అయిన తౌకీర్ రజాను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. 'ఐ లవ్ మహమ్మద్' ప్రచారానికి మద్దతుగా ఆయన చేసిన ఓ వీడియో పిలుపుతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసినట్లు అధికారులు తెలిపారు. ఓ పోస్టర్ వివాదం నేపథ్యంలో గత కొన్ని వారాలుగా చెలరేగుతున్న ఆందోళనల్లో భాగంగా శుక్రవారం బరేలీలో భారీ ప్రదర్శన చేపట్టారు. అయితే, ఈ ర్యాలీ కొద్దిసేపటికే హింసాత్మకంగా మారింది. నిరసనకారులు పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడటంతో, వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ ఘర్షణలో సుమారు 10 మంది పోలీసు సిబ్బందికి గాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనల తర్వాత తౌకీర్ రజా ఇంటి వద్ద భారీ సంఖ్యలో జనం గుమికూడి నినాదాలు చేశారు. దీంతో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ హింసాత్మక ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేయగా, 50 మందికి పైగా అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, పోలీసులపై దాడి, అల్లర్లకు పాల్పడటం వంటి సెక్షన్ల కింద మొత్తం 1700 మంది గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

## వాంగ్‌చుక్‌కు పాక్‌తో సంబంధాలు

**ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నాం: లడఖ్ డీజీపీ**

లడఖ్: లడఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నామని డీజీపీ ఎస్‌డీ సింగ్ జామ్వాల్ వెల్లడించారు. లెహ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వాంగ్‌చుక్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు అనుమానిస్తున్న ఒక పాకిస్థానీ గూఢచారిని ఇటీవల అరెస్టు చేసినట్లు తెలిపారు. సోనమ్ నిరసనల వీడియోలను ఆ వ్యక్తి పాకిస్థాన్‌కు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. లడఖ్‌లో చెలరేగిన హింస వెనుక వాంగ్‌చుక్ కీలక వ్యక్తి అని, ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని డీజీపీ ఆరోపించారు. వాంగ్‌చుక్ విదేశీ పర్యటనల్లో కొన్ని అనుమానాస్పదంగా ఉన్నాయని ఆయన అన్నారు. పాకిస్థాన్‌లో ది డాన్ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారని, బంగ్లాదేశ్‌ను కూడా సందర్శించారని తెలిపారు. వాంగ్‌చుక్ స్వచ్ఛంద సంస్థకు విదేశీ నిధులపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

## లయ్యారి చిత్రం


రోష్టి సర్దానా




## నాని సినిమాలో విలన్‌గా పృథ్వీరాజ్



న్యాచురల్ స్టార్ నాని ది ప్యారడైజ్ సినిమా భారీ ప్లానింగ్ తో వస్తుంది. ఈ సినిమా విషయంలో న్యాచురల్ స్టార్ నాని ఫ్యాన్స్ అయితే చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నారు. శ్రీకాంత్ ఓదెల ఈసారి కూడా నాని కెరీర్ బెస్ట్ హిట్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ది ప్యారడైజ్ సినిమా అంతా ఒక కొత్త వరల్డ్ లో జరుగుతున్నట్టు ఉంటుందట. నాని క్యారెక్టరైజేషన్ ఐతే నెక్స్ట్ లెవెల్ అని టాక్. ఐతే ఈ సినిమా 2026 మార్చి 26 రిలీజ్ ఫిక్స్ చేశారు. ఈ మూవీ తర్వాత నాని సుజిత్ డైరెక్షన్ లో సినిమా ఫిక్స్ చేసుకున్నాడు. నాని సుజిత్ ఈ కాంబోలో ఒక క్రేజీ యాక్షన్ మూవీ రాబోతుంది. బ్లడీ రోమియో టైటిల్ తో ఈ సినిమా రాబోతుంది. ఐతే ఈ సినిమాకు సంబంధించిన ఒక లీక్ ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది. నాని కోసం సుజిత్ భారీ సెటప్ ప్లాన్ చేస్తున్నాడు. అంటే నానికి విలన్ గా పాన్ వరల్డ్ విలన్ నే సెట్ చేస్తున్నాడట. ఎవరతను అంటే అతనే మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ అని అంటున్నారు. హీరోగా డైరెక్టర్ గా చేస్తూనే తెలుగులో విలన్ గా రాణిస్తున్నారు పృథ్వీరాజ్. ఆల్రెడీ సలార్ 1 లో చేశాడు. ప్రస్తుతం మహేష్ రాజమౌళి కాంబో సినిమాలో ప్రతినాయకుడిగా చేస్తున్నారు. ఇప్పుడు సుజిత్ నాని సినిమాలో కూడా విలన్ గా చేయబోతున్నారట.

## జోరుగా కే ర్యాంప్ ప్రమోషన్స్

దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న థియేటర్లకు రానున్న కె ర్యాంప్ సినిమాపై ప్రమోషన్స్ జోరుగా జరుగుతున్నాయి. సక్సెస్‌ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న ఈ చిత్రానికి జైన్స్ నాని దర్శకత్వం వహించగా, హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్స్‌పై రాజేష్ దండా, శివ బొమ్మకు ఈ సినిమాను నిర్మించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ర్యాంప్ మీట్‌లో మొత్తం టీమ్ సినిమాపై తమ అనుభవాలు, కాన్ఫిడెన్స్ ను షేర్ చేసుకున్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, సినిమా మొత్తాన్ని మేమంతా చూశాం. అన్ని వర్గాల వయసుల వారు కూడా ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉంది. ఈ మూవీ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. యుక్తి పాత్ర చాలా ఫన్నీగా ఉంటుంది. మా కాంబినేషన్ థియేటర్‌లో ఆడియన్స్‌ని కచ్చితంగా నవ్విస్తుంది. మా ప్రొడ్యూసర్స్, డైరెక్టర్ సపోర్ట్ వల్లే ఇంత కంఫర్ట్‌గా వర్క్ చేశాం. ఈ దీపావళికి మా కె ర్యాంప్ పక్కా ఎంటర్‌టైన్ చేస్తుంది. నేను గ్యారెంటీ ఇస్తున్నని కిరణ్ అన్నారు. ఇక రచయిత రవి మాట్లాడుతూ, హీరో కష్టపడితే ప్రేక్షకులకు ఆ సీన్స్ హత్తుకునేలా ఉంటాయి. కానీ కె ర్యాంప్లో హీరో ఎంత స్ట్రగుల్ అయితే ప్రేక్షకులు అంత ఎంజాయ్ చేస్తారు. ఈ మూవీ ఒక కొత్త అనుభూతి ఇస్తుంది. అక్టోబర్ 18న థియేటర్లలో అందరం కలసి ఆ ఫన్‌ను చూడబోతున్నాం" అన్నారు.



## మరోసారి తండ్రి అయిన సుహాస్

విభిన్నమైన కథలతో హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడు సుహాస్ ఒక సంతోషకరమైన వార్తను పంచుకున్నారు. ఆయన రెండోసారి తండ్రయ్యారు. సుహాస్-లలిత దంపతులకు మరోసారి కుమారుడు జన్మించాడు. ఈ శుభవార్తను సుహాస్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా అభిమానులతో పంచుకోవడంతో, ఆయనకు సినీ ప్రముఖులు, స్నేహితులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది జనవరిలో సుహాస్ దంపతులకు మొదటి కుమారుడు జన్మించగా, ఇప్పుడు రెండో వారసుడు కూడా వారి కుటుంబంలోకి అడుగుపెట్టాడు. సుహాస్ కెరీర్ ప్రారంభం నుంచి తనకంటూ ఓ ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్నారు. షార్ట్ ఫిల్మ్స్ నుంచి నటుడిగా ప్రయాణం మొదలుపెట్టి, పలు చిత్రాల్లో సహాయ నటుడిగా, కమెడియన్‌గా మెప్పించారు. 'కలర్ ఫొటో' సినిమాతో హీరోగా మారి తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆ తర్వాత 'రైటర్ పద్మభూషణ్', 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్' వంటి చిత్రాలతో నటుడిగా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు.

## జాన్వీకి కష్టమే..!

శ్రీదేవి నటవారసురాలిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన జాన్వీ కపూర్‌కి మంచి ఆరంభం లభించింది. అయితే కమర్షియల్‌గా బిగ్ సక్సెస్‌లను దక్కించుకోవడంలో జాన్వీ కపూర్ విఫలం అయింది. అయినా కూడా సోషల్ మీడియాలో ఈమె అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు గుర్తింపు దక్కించుకుంటూ వచ్చింది. జాన్వీ కపూర్ అందంతో ఆకట్టుకోవడంతో సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంటూ ఉంది. ఆ మధ్య వచ్చిన పరమ్ సుందరి సినిమాతో జాన్వీ కపూర్ ఖచ్చితంగా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందని అంతా భావించారు. ఆమె కూడా పరమ్ సుందరి విషయంలో చాలా ఆసక్తిని పెంచుకుంది. కానీ నిరాశనే మిగిల్చిన విషయం తెల్సిందే. ఇప్పుడు ఈమె వరుణ్ ధావన్‌తో కలిసి 'సన్నీ సంస్కారికి తులసి కుమారి' సినిమాతో రాబోతున్న విషయం తెల్సిందే. ఈ సినిమాను దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే, సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిస్తే జాన్వీ కపూర్‌కి హిందీలో ఆఫర్లు తగ్గే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందుకే బాలీవుడ్‌లో జాన్వీ కపూర్‌కి ఈ సినిమా లైఫ్ అండ్ డెత్ మ్యాటర్ అన్నట్లుగా మారింది.






## వరలక్ష్మి కొత్త అవతారం

వరలక్ష్మి శరత్ కుమార్ ఎలాంటి పాత్రనైనా చేస్తూ ఆడియన్స్ ని మెప్పిస్తూ వస్తున్నారు ఆమె. ఆల్రెడీ అంతకుముందు తమిళ్ హీరోయిన్ గా క్రేజ్ తెచ్చుకున్న వరలక్ష్మి శరత్ కుమార్ ఈమధ్య విలన్ గా కూడా మంచి పాపులారిటీ తెచ్చుకున్నారు. తెలుగులో కూడా క్రాక్, వీర సింహా రెడ్డి లాంటి సినిమాల్లో మెప్పించారు. హనుమాన్ లో కూడా ఒక మంచి రోల్ లో అదరగొట్టారు వరలక్ష్మి శరత్ కుమార్. ఐతే ఇప్పుడు ఆమె కెరీర్ లో కొత్త టర్న్ తీసుకున్నారు. యాక్టర్ గానే కాదు డైరెక్టర్ గా కూడా తన సత్తా చాటుతా అంటున్నారు వరలక్ష్మి శరత్ కుమార్. వరలక్ష్మి శరత్ కుమార్ తన సోదరి పూజా శరత్ కుమార్ తో కలిసి దోశ డైరీస్ అనే కొత్త ప్రొడక్షన్ ని మొదలు పెట్టారు.

## రాజ్‌కుంద్రా 150 కోట్ల బిట్ కాయిన్ స్కామ్



నీలి చిత్రాల యాప్‌ల వ్యాపారంతో పాటు, కోట్లాది రూపాయల స్కామ్‌లలో ప్రముఖ నటి శిల్పా శెట్టి భర్త, నిర్మాత రాజ్ కుంద్రా పేరు హెడ్ లైన్స్ లోకొస్తోంది. ఇటీవల అతడిపై ఈడీ దర్యాప్తు సాగుతోంది. ఈ దర్యాప్తులో అతడి మోసాల కథల్ని ఈడీ బయటపెడుతోంది. తాజాగా బిట్‌కాయిన్ స్కామ్‌లో వ్యాపారవేత్త రాజ్ కుంద్రాపై మనీలాండరింగ్ ఆరోపణ చర్చగా మారింది. ఆయన వద్ద రూ.150.47 కోట్ల విలువైన 285 బిట్‌కాయిన్లు ఉన్నాయని ఈడీ అధికారులు ఆరోపించారు. కుంద్రా ఈ కాయిన్‌లను కొన్న యజమాని అని ఈడీ వాదిస్తుంటే, ఈ లావాదేవీలలో కేవలం మధ్యవర్తిని మాత్రమేనని ఆయన వాదిస్తున్నారు.




# పసిడితో జంప్..!

## స్వర్ణం పట్టిన హై జంపర్ శైలేశ్

### కాంస్యంతో మెరిసిన వరుణ్

పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్లు పతకాల వేట మొదలెట్టారు. హైజంపర్ శైలేష్ కుమార్ దేశానికి తొలి స్వర్ణం అందించాడు. ఇదే విభాగంలో పోటీ పడిన వరుణ్ సింగ్ భాటి కాంస్యంతో మెరిశాడు. అయితే.. రాహుల్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఒలింపిక్ విజేత ఎజ్రా ఫ్రెచ్(అమెరికా) రెండో స్థానంలో నిలిచి వెండి పతకం సాధించాడు. ఢిల్లీ వేదికగా జరుగుతున్న పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ పన్నెండో సీజన్‌లో శైలేష్ అదరగొట్టాడు. టీ 42 విభాగంలో అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన కనబరుస్తూ 1.91 మీటర్ల ఎత్తు దూకాడు. దాంతో, పసిడి పతకం కొల్లగొట్టడమే కాకుండా ఆసియా రికార్డును బ్రేక్ చేశాడీ 25 ఏళ్ల అథ్లెట్. వరుణ్ సింగ్ భాటీ తొలి ప్రయత్నంలో ఫ్రెచ్‌కు పోటీగా 1.85 మీటర్ల ఎత్తు దుమికినా.. రెండో ప్రయత్నంలో మాత్రం విఫలమయ్యాడు. ఇక, ఆర్చరీలో శీతల్ దేవీ సంచలన ప్రదర్శనతో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. ఆద్యంతం హెూరాహెూరీగా సాగిన ఫైనల్లో టర్కీకి చెందిన ఒజ్నూర్ కురే గుర్దీను 146-143తో ఓడించింది శీతల్. జవహర్‌లాన్ నెహ్రూ స్టేడియంలో సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 5 వరకూ ఈ మెగా టోర్నీ జరుగనుంది. మొత్తంగా వంద దేశాల నుంచి 1000 మంది అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. స్ప్రింట్స్, మారథాన్, జంప్స్, జావెలిన్ త్రో.. వంటి ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు.



## అభిషేక్ శర్మకు గాయం!?

ఆసియాకప్ ఫైనల్‌కు ముందు టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ గాయపడినట్లు తెలుస్తోంది. శ్రీలంకతో శుక్రవారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో అభిషేక్ శర్మ విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఫీల్డింగ్ సమయంలో అతను మైదానంలోకి రాలేదు. తొడ కండరాలు పట్టేయడంతోనే అభిషేక్ శర్మ ఫీల్డింగ్ చేయనట్లు తెలుస్తోంది. అభిషేక్ శర్మతో పాటు హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మకు కూడా కండరాలు పట్టేయడంతో మైదానం వీడారు. తొలి ఓవర్ వేసి వికెట్ తీసిన హార్దిక్ పాండ్యా కండరాలు పట్టేయడంతో మైదానం వీడాడు. ఆ తర్వాత అతను మళ్లీ బౌలింగ్‌కు రాలేదు. మ్యాచ్ చివర్లో బౌండరీ లైన్‌పై క్యాచ్ పట్టేందుకు ఎగిరిన తిలక్ వర్మకు కూడా కండరాలు పట్టేసాయి. దాంతో అతను కూడా మైదానం వీడాడు. అయితే ఈ ముగ్గురి గాయాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఉక్కపోత వాతావరణం కారణంగా కండరాలు పట్టేసాయని మ్యాచ్ అనంతరం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. శనివారం రికవరీడేగా వాడుకొని ఫైనల్‌కు సిద్ధమవుతామని స్పష్టం చేశాడు. మీడియా సమావేశంలో టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా ఇదే విషయాలన్ని వెల్లడించాడు. అయితే శనివారం వారి ఫిట్‌నెస్‌పై ఓ అంచనాకు వస్తామని చెప్పాడు.

# ధోనీ జెర్సీతో రండి.. మాకు మద్దతివ్వండి!


## భారత అభిమానులకు ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా విన్నపం






భారత గడ్డపై మరో మూడు రోజుల్లో మహిళల ప్రపంచ కప్ పోటీలకు తెరలేవనుంది. టీమిండియా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నా ఏడుసార్లు ఛాంపియన్ ఆస్ట్రేలియా అవకాశాల్ని కొట్టిపారేయలేం. ఈమధ్యే మూడు వన్డేల సిరీస్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేనకు చెక్ పెట్టిన ఆసీస్ వరల్డ్ కప్ లక్ష్యంగా అడుగులు వేస్తోంది. టోర్నీకి ముందే భారత అభిమానుల మనసులు చూరగొనేందుకు కంగారూ కెప్టెన్ అలీసా హేలీ సరదాగా ఓ విజ్ఞప్తి చేసింది. తమ జట్టు మ్యాచ్‌లకు అందరూ పసుపు రంగు జెర్సీలతో రావాలని ఆమె ఫ్యాన్స్‌ను కోరింది. 'భారత అభిమానులారా వరల్డ్ కప్‌లో మీరంతా మహేంద్ర సింగ్ ధోనీ జెర్సీ ధరించండి. ధోనీ ప్రాతినిధ్యం వహిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్‌కు సంబంధించిన పసుపు రంగు జెర్సీలతో మా మ్యాచ్‌లు చూసేందుకు రండి. మీరు అలా చేస్తే మేము చాలా సంతోషిస్తాం. ప్రేక్షకుల్లో ఎక్కువ మంది ఎల్లో జెర్సీతో కనిపిస్తే మా జట్టులో ఉత్సాహం నిండుతుంది. ఎంతైనా సీఎస్కే జెర్సీ.. మా టీమ్ జెర్సీ రంగు పసుపు వర్ణమే కదా' అని హేలీ సరదాగా వ్యాఖ్యానించింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మహిళల ప్రపంచకప్ సెప్టెంబర్ 30న ప్రారంభం కానుంది. దివంగత అస్సాం గాయకుడు జుబీన్ గార్గ్‌కు నివాళులు.. ఆపై శ్రేయా ఘోషల్ పాటల హెూరు తర్వాత ఆరంభ పోరులో టీమిండియా, లంక ఢీకొడుతాయి. ఈ మెగా టోర్నీలో అక్టోబర్ 1వ తేదీన న్యూజిలాండ్‌తో హేలీ సారథ్యంలోని ఆస్ట్రేలియా తలపడుంది. వరల్డ్ కప్ చరిత్రలో మరేజట్టుకు సాధ్యంకాని విధంగా ఏడు టైటిళ్లలు కొల్లగొట్టిన ఆసీస్ నుంచే మొదటిసారి ట్రోఫీ ముద్దాడాలనుకుంటున్న భారత్‌కు గట్టి పోటీ ఎదుర్వవనుంది

# అర్ష్‌దీప్‌ను ఆడించాలి






పాక్‌తో ఫైనల్లో టీమిండియా విజయం సాధించాలంటే అర్ష్‌దీప్ సింగ్‌ను ఆడించాలని మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. డెత్ ఓవర్లలో అర్ష్‌దీప్ సింగ్ కీలకమవుతాడని చెప్పాడు. 'పాకిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా బుమ్రాతో పాటు అర్ష్‌దీప్ సింగ్‌ను ఆడించాలి. ఎందుకంటే అర్ష్‌దీప్ సింగ్ డెత్ ఓవర్లలో అద్భుతంగా రాణించగలడు. యార్కర్లను నిలకడగా వేయగలడు. ఒత్తిడిలో కెప్టెన్‌ను అడిగి మరి బౌలింగ్ చేస్తాడు. ఓవైపు బుమ్రా.. మరోవైపు అర్ష్‌దీప్ సింగ్ యార్కర్‌లతో దాడి చేస్తే పాకిస్థాన్ బ్యాటర్లు ఇబ్బంది పడుతారు. తొలి రోజు నుంచి నేను ఇదే చెబుతున్నా. అర్ష్‌దీప్ సింగ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలి. కానీ టీమిండియా మేనేజ్‌మెంట్ మాత్రం బ్యాటింగ్ డెప్త్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. దాంతోనే పేస్ ఆల్‌రౌండర్ అయిన శివమ్ దూబేను ఆడిస్తోంది. శివమ్ దూబే వల్లే అర్ష్‌దీప్ సింగ్‌కు జట్టులో చోటు లభించడం లేదు. కానీ అతను ఎప్పుడూ నా ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉంటాడు. శ్రీలంకతో మ్యాచ్‌లో అర్ష్‌దీప్ అవసరం ఏంటో తెలిసొచ్చింది. ఇప్పటికైనా టీమిండియా మేనేజ్‌మెంట్ పునరాలోచన చేయాలి. 'అని సోనీ టీవీ కార్యక్రమంలో ఇర్ఫాన్ పఠాన్ విజ్ఞప్తి చేశాడు.



## 60 కోట్ల భరణం అంతా ఉత్తిదే

భారత క్రికెటర్ యజ్వేంద్ర చాహల్‌తో ప్రేమ, పెళ్లి.. ఆపై నాలుగేళ్లకు విడాకులతో వార్తల్లో నిలిచింది ధనశ్రీ వర్మ. పరస్పర అంగీకారంతో విడిపోయిన ఈ ఇద్దరూ ఈమధ్య తరచూ వైరలవుతున్నారు. అయితే.. విడాకుల కారణంగా ధనశ్రీకి చాహల్ పెద్ద మొత్తం 'భరణం'గా చెల్లించాడనే కథనాలు వినిపిస్తున్నాయి. ఏకంగా రూ.60 కోట్లను ఆమెకు ముట్టజెప్పాడని సోషల్ మీడియా కోడై కూస్తోంది. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న తప్పుడు వార్తలను ధనశ్రీ ఖండించింది. ఇదివరకే భరణం తీసుకోవడాన్ని వ్యతిరేకించి విమర్శలపాలైన ఈ కొరియోగ్రాఫర్.. తాజాగా 'రైజ్ అండ్ ఫాల్' అనే ఎపిసోడ్‌లో రూ.60 కోట్ల ప్రచారంపై స్పందించింది. 'నేను, చాహల్ పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నాం. కానీ, నేను ఏమీ మాట్లాడడం లేదని భరణం గురించి ఎవేవో కథనాలు వ్యాపింపజేస్తున్నారు. నాకు నచ్చిన విషయాలపై దృష్టి సారించాలని అమ్మానాన్న సూచించారు. అయినా.. జనాలకు ఇవన్నీ చెప్పి సమయం వృథా చేసుకోవడం నాకు నచ్చదు. ఇక భరణం విషయానికొస్తే అది నాకు అవసరం లేదు. కానీ, నేను రూ. 60 కోట్లు డిమాండ్ చేశానని అందరూ అనుకుంటున్నారు. కానీ, ఇవన్నీ నిరాధారమైనవి. నేను అంత మొత్తాన్ని డిమాండ్ చేయలేదు. పైగా చాహల్ నుంచి నాకు ఇంతమొత్తం ఇస్తామని సందేశం కూడా రాలేదు. ఈ విషప్రచారం నిజం కాదు. బాధ్యతలేని సంస్థలు తమ ప్రయోజనం కోసం కుటుంబాలను వివాదాల్లోకి లాగుతుంటాయి. ఇలాంటి వార్తలు హానిచేస్తాయి. అందుకే మీడియాను నేను కోరేది ఒక్కటే. దయచేసి తప్పుడు వార్తలు ప్రచారం చేయకండి' అని ధనశ్రీ వర్మ సున్నితంగా హెచ్చరించింది.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
ఆదివారం 28-9-2025
www.evarthalu.com



# గుండె గూటిలో దడదడ

**అదేంటో.. బెలూన్ పలిగినట్లే గుండె పగులుతోంది. ఏమీ చేసినా, ఏమీ చేయకున్నా.. గుండె పోటెత్తుతోంది. పడుకున్నా, లేచినా గుండె ఆగిపోతోంది. అందులోనూ యువతకే రోజుకు పదుల సంఖ్యలో గుండె పోట్లు వస్తున్నాయ్. ఎలాంటి లక్షణాలు కనిపించకున్నా అలా గుండె పోటు వచ్చిందా.. ఇలా మరణ శయ్యపై వాలిపోవాల్సి వస్తోంది. మొత్తానికి గుండె గూటిలో దడదడ తప్పడం లేదు.**

ప్రపంచవ్యాప్తంగా ఏటా 1.79 కోట్ల మంది వరకు గుండెపోటుతో మరణిస్తున్నారు. వారిలో అయిదో వంతు భారత్ నుంచే ఉంటున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. అధికారిక లెక్కలు దీనికి భిన్నంగా ఉంటున్నాయి. గుండెజబ్బుల్లో హృదయ రక్తనాళాల్లో పూడిక చాలా ప్రమాదకరమైంది. ప్రారంభంలోనే దీన్ని నివారించకపోతే ప్రాణాంతకంగా మారవచ్చు. కొందరికి వంశపారంపర్యంగా గుండె జబ్బులు వస్తుంటాయి. మరికొందరు ధూమపానం, మద్యపానం, వ్యాయామం లేకపోవడం, గతి తప్పిన జీవన శైలి, శరీర బరువును నియంత్రణలో ఉంచుకోకపోవడం తదితరాల ద్వారా చేజేతులా గుండెజబ్బులు కొనితెచ్చుకుంటున్నారు. విశ్వవ్యాప్తంగా అన్ని క్యాన్సర్ల కన్నా, గుండె జబ్బుల మరణాలే అధికంగా ఉంటున్నాయి. ముఖ్యంగా 50శాతం గుండెపోట్లు యాభై ఏళ్లలోపు వారిలోనే సంభవిస్తున్నాయి. ముఖ్యంగా మూడు పదుల వయసు వారిలోనూ హృద్రోగ సమస్యలు తలెత్తుతుండటం ఆందోళన కలిగిస్తున్నాయి. అరవై శాతం గుండె సంబంధిత మరణాలకు సడన్ కార్డియాక్ అరెస్టే ప్రధాన కారణం. మితిమీరి వ్యాయామం చేసినప్పుడు, వేగంగా పరిగెత్తినప్పుడు, క్రీడలు ఆడే సమయంలో గుండె సాధారణ పనితీరు అకస్మాత్తుగా గతి తప్పుతుంది. దీన్నే వైద్య పరిభాషలో సడన్ కార్డియాక్ అరెస్ట్ అని, జన వ్యవహారంలో గుండెపోటుగా వ్యవహరిస్తున్నాం. ఇలాంటివారికి వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా ఆస్పత్రికి తరలించే వరకు ప్రాణాపాయాన్ని తప్పించవచ్చు. కార్డియాక్ అరెస్టుల్లో 30శాతం ఆస్పత్రుల్లో సంభవిస్తున్నాయి. 70శాతం ఇళ్లలో, బయటి ప్రదేశాల్లో వస్తున్నాయి.

దీర్ఘకాలికంగా ఒత్తిడికి గురికావడం వల్ల శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయులు పెరుగుతాయి. ఈ ఒత్తిడి హార్మోన్ ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ ఉత్పత్తికి అంతరాయం కలిగిస్తుంది. అధిక కార్టిసాల్.. రక్త నాళాలను బిగుతుగా చేస్తుంది. రక్తంలో చక్కెరను పెంచుతుంది. అవయవాల చుట్టూ కొవ్వు పేరుకుపోవడాన్ని ప్రోత్సహిస్తుంది. ఇక ఒత్తిడి, అధిక రక్తపోటు.. గుండె లయను దెబ్బతీస్తుంది. ముఖ్యంగా మెనోపాజ్ దశలో హార్మోన్ల మార్పులు.. మహిళలను ఈ ప్రమాదానికి ఎక్కువగా గురి చేస్తాయి. అడ్రినలిన్, కార్టిసాల్ వంటి హార్మోన్లతో నిండిన మహిళల శరీరం.. నిరంతర రక్తపోటు, గుండె దడను పెంచుతుంది. దీర్ఘకాలంలో గుండెపోటుకు దారితీస్తుంది. కాబట్టి, ప్రమాదం తీవ్రం కాకముందే స్పందించాలి. గుండెపోటు సంకేతాలను గుర్తించాలి. అయితే, మహిళల్లో వచ్చే గుండెపోటు లక్షణాలు వేరుగా ఉంటాయి. పురుషుల్లో ఎక్కువగా కనిపించే 'క్లాసిక్' ఛాతీ నొప్పి.. వీరిలో కనిపించకపోవచ్చు. బదులుగా.. శ్వాస ఆడకపోవడం, తీవ్రమైన అలసట, వికారం, తల తిరగడం, దవడతోపాటు మెడ, వీపు పైభాగంలో అసౌకర్యంగా అనిపించడం, అజీర్ణం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సంకేతాలను కొందరు గ్యాస్ట్రిక్ సమస్యలు, తల తిరగడం లాంటి మామూలు సమస్యలుగానే భావిస్తారు. అయితే, ఈ సమస్యలు నిరంతరంగా, అసాధారణంగా అనిపిస్తే గుండె ప్రమాదంలో ఉన్నట్లే. ఇక ఈ సమస్యలకు నిద్ర లేమి, అధిక బరువు కూడా తోడైతే.. తీవ్రత మరింత పెరుగుతుంది. కాబట్టి.. ఇలాంటి సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. పెరిమెనోపాజ్, మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. జీవనశైలిలో మార్పులతో సమస్యను చాలావరకూ తగ్గించుకోవచ్చు.



## ఖసీపీఆర్.. అవగాహన లేదు!

పాశ్చాత్య దేశాల్లో సీపీఆర్‌పై పెద్ద సంఖ్యలో ప్రజలకు అవగాహన ఉంది. భారత్‌లో మాత్రం రెండు శాతం జనాభాకే సీపీఆర్ గురించి తెలుసు. అపార్ట్‌మెంట్లు, కళాశాలలు, కార్యాలయాలు తదితరాల్లో సీపీఆర్‌పై భారీగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బందితో పాటు బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, పోలీసులు, ఇతర ఔత్సాహికులు అందరికీ సీపీఆర్ ఎలా చేయాలో నేర్పించాలి. పాశ్చాత్య దేశాల్లో షాపింగ్ మాళ్లు, విమానాశ్రయాల్లో ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్లు (ఏఈడీలు) అందుబాటులో ఉంటాయి. కార్డియాక్ అరెస్టుకు గురైనవారికి వీటి సాయంతో చిన్న కరెంటు షాకును అందించడం ద్వారా గుండె లయను యథా స్థితికి వచ్చేలా చేయవచ్చు. తద్వారా ఆస్పత్రికి తరలించేలోగా వారిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు. భారత్‌లోనూ అన్ని జనసమ్మర్ద ప్రాంతాల్లో ఏఈడీలను ఏర్పాటు చేయడంతో పాటు, వాటి వినియోగంపైనా ప్రజలకు అవగాహన కల్పించాలి.

## గుండె వైఫల్యం అంటే..


గుండె మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. మన శరీరంలో ఉన్న అన్ని అవయవాలకు రక్తాన్ని సరఫరా చేస్తుంది. ఈ పని చేయడానికి గుండె నిరంతరం కొట్టుకుంటూనే ఉంటుంది. అయితే మనం చేసే పనులను బట్టి కొన్నిసార్లు గుండె కొట్టుకునే వేగం పెరగవచ్చు. సాధారణంగా మన గుండె నిమిషానికి 60 నుండి 100 సార్లు కొట్టుకుంటుంది. వ్యాయామం చేసినప్పుడు గుండె వేగం పెరగడాన్ని మనం గమనించవచ్చు, తర్వాత కొంత సమయానికి సాధారణ స్థాయికి వచ్చేస్తుంది. అయితే మన జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ప్రస్తుతం అనేక మందిలో గుండె సమస్యలు ఏర్పడుతున్నాయి, వీటిలో గుండె వైఫల్యం కూడా ఒకటి. గుండె వైఫల్యం అంటే గుండె పనిచేయడం ఆగిపోవడం అని కాదు. గుండె పనిచేసే సామర్థ్యం తగ్గడాన్ని గుండె వైఫల్యం అంటారు. అంటే శరీరానికి కావాల్సిన రక్తాన్ని గుండె అందించలేక పోవడాన్ని గుండె వైఫల్యంగా వివరించవచ్చు.

## ఆహారమే ఆరోగ్యం

దేశంలో గుండె సమస్యలతో ఎంతో మంది బాధపడుతున్నారు. గుండె సంబంధిత వ్యాధుల కారణంగా ఎంతో మంది మరణిస్తున్నారు. వేళకు ఆహారం తీసుకోకపోవడం, వ్యక్తిగత, వృత్తిపరమైన ఒత్తిళ్లు, తగినంత వ్యాయమం లేకపోవడం వంటివి గుండె పనితీరును మందగింపజేస్తున్నాయి. రక్తనాళాల్లో కోలెస్ట్రాల్ స్థాయిలు పెరిగిపోవడం కూడా గుండె పనితీరును ప్రభావితం చేస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆకు కూరలు గుండెకు ఎంతో మంచిది. క్యాన్సర్ వంటి రోగాలను సైతం దరిచేరనివ్వవు. పాలకూర, కొత్తమీద, ర్యాడిష్ మొదలైన వాటిలో కొవ్వు శాతం తక్కువ ఉండటంతో పాటు ఫోలిక్ యాసిడ్, మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం ఎక్కువగా లభిస్తాయి. ఇవి గుండె పనితీరును మెరుగు పర్చడంలో ఎంతో సహాయపడతాయి. రోజూ ఆహారంలో భాగంగా ఇవి తీసుకునేవారికి మిగిలిన వారితో పోలిస్తే హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు 11 శాతం తక్కువగా ఉంటాయి. ప్రతిరోజు ఉదయం బ్రేక్‌ఫాస్టులో ఓట్స్ తినడం గుండెకు ఎంతో మేలు చేస్తాయి. వీటిలో లభించే బీటా గ్లూకాన్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. గోధుమలు, బార్లీ, పప్పు ధాన్యాలు, బీన్స్ మొదలైనవి ఆహారంలో తీసుకోవడం మంచిది. వీటిలో ఉండే విటమిన్స్, ఐరన్, ఫైబర్ యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటును అదుపులో ఉంచుతాయి. దీని ద్వారా గుండె పనితీరు మెరుగుపడుతుంది. ఇవే కాకుండా టోమాటోలు, యాపిల్స్, సోయా వంటివి రోజువారీగా తీసుకున్నట్లయితే గుండెను పూర్తిగా ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. చేపలు ఎక్కువగా తినేవారిలో హృదయ సంబంధిత వ్యాధులు తక్కువేనంటున్నారు వైద్య నిపుణులు. చేపల్లో ఉండే ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు గుండె పనితీరును మెరుగు పరుస్తాయి.

### వద్దు సోదరా.. వదిలేయ్!

- పొగాకు వినియోగం
- అనారోగ్యకరమైన ఆహారం
- శారీరక స్తబ్ధత
- మద్యం వినియోగం



## గుండె బలంగా ఉండాలంటే..

- ఉప్పు తగ్గించడం: ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల శరీరంలో ద్రవాలు చేరిపోవడం గుండెపై ఒత్తిడిని పెంచుతుంది. అందుకే ఉప్పు తక్కువగా ఉండే ఆహారాలు ఉపయోగకరం.
- కొవ్వు పదార్థాలు, పచ్చి వంటకాలు తగ్గించడం: అనారోగ్యకరమైన కొవ్వులు, పచ్చి వంటకాలు గుండె ఆరోగ్యానికి హానికరం. ఇవి కొలెస్ట్రాల్, కొత్త ప్లాక్‌లు ఏర్పడతాయి, అవి గుండె సమస్యలకు దారితీస్తాయి.
- పండ్లు, కూరగాయలు: గుండె ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజపదార్థాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి.
- క్రమం తప్పని వ్యాయామం: రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం వల్ల గుండె కండరాలు బలోపేతం అవుతాయి. నడవడం, సైక్లింగ్ చేయడం, ఈత కొట్టడం వంటివి గుండె ఆరోగ్యానికి మంచివి.
- బరువు నియంత్రణ: అధిక బరువు ఉన్నవారి గుండెపై ఎక్కువ ఒత్తిడి పడుతుంది. ఆరోగ్యకరమైన బరువును నియంత్రించుకోవడం వల్ల గుండె భారాన్ని తగ్గిస్తుంది.
- ధూమపానం, మద్యపానం మానేయడం: ధూమపానం రక్తనాళాలను దెబ్బతీస్తుంది, అధిక మద్యపానం గుండె కండరాలను బలహీనపరుస్తుంది. ఈ రెండు అలవాట్లను పూర్తిగా మానేయడం గుండె ఆరోగ్యానికి చాలా ముఖ్యం.
- దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించడం: అధిక రక్తపోటు: క్రమం తప్పని రక్తపోటు పరీక్షలు చేయించి, డాక్టర్ సూచనల ప్రకారం మందులు వాడాలి.
- మధుమేహం: రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం ద్వారా గుండె సమస్యలను నివారించవచ్చు.
- కొలెస్ట్రాల్ స్థాయిలు: కొలెస్ట్రాల్ నియంత్రణకు మందులు వాడడం, ఆహార నియమాలు పాటించడం అవసరం.
- ఒత్తిడి తగ్గించడం: దీర్ఘకాలిక ఒత్తిడి గుండెపై భారాన్ని పెంచుతుంది. యోగా, ధ్యానం వంటివి ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడతాయి.

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.